చాకలి ఐలమ్మ విగ్రహ ధ్వంసంపై
పద్మా దేవేందర్‌రెడ్డి ఆగ్రహం



మిగతా 2లో..


# బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం-14, అక్టోబర్ - 2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## దుబాయ్‌లో బతుకమ్మ సంబరాలు..



వివరాలు 2లో..

# ఉచిత విద్యుత్‌కు ఎసరు పెట్టే కుట్ర..

- రైతు డిస్కమ్ ఏర్పాటు జీవోపై హరీశ్‌రావు సీరియస్



హైదరాబాద్, అక్టోబర్ 13: ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సహా ఇతర రాజకీయ పార్టీలు, ఉద్యోగ సంఘాలు, విద్యుత్ రంగ నిపుణులు, సామాజికవేత్తలు, రైతులు లేవనెత్తుతున్న అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ రైతు డిస్కమ్ ఏర్పాటు చేస్తూ జీవో17 జారీ చేయడాన్ని హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. రైతు డిస్కమ్ ఏర్పాటు జీవో జారీ కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, దుర్మార్గ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఉచిత విద్యుత్ సరఫరాకు పాతరేసి, రైతు మెడకు ఉరేసేందుకేనా ఈ కుట్ర అని ప్రశ్నించారు.వ్యవసాయానికి, గృహాలకు, పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా చేయలేకపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు రైతు డిస్కమ్ పేరుతో మరో డ్రామాకు తెరతీయడం సిగ్గుచేటు అని హరీశ్‌రావు విమర్శించారు. రైతు డిస్కమ్ ఏర్పాటు వల్ల రైతులకు ఒరిగే ప్రయోజనం ఏమిటి? రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ఈ నిర్ణయం ఎలా దోహదపడుతుందో చెప్పకుండా మొండిగా వ్యవహరించడం దుర్మార్గమని మండిపడ్డారు. సర్కార్ నిర్వాకంతో అన్నదాత మరింత ఇబ్బందుల్లో పడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ట్రాన్స్ఫార్మర్స్ కాలిపోతే దిక్కు లేదు.. రేపు రైతు డిస్కం తో మరింత ఇబ్బందులు తలెత్తే పరిస్థితి ఉందని అన్నారు. రైతు మెడకు రైతు డిస్కం ఉచ్చు..ఉచిత విద్యుత్ పై చేతులెత్తేసేందుకే సర్కార్ కొత్త ఎత్తుగడ అని తెలిపారు. పంటలు ఎండి రైతు కన్నీరు పెడుతుంటే.. డిస్కంల పేరిట రేవంత్ సర్కార్ రాజకీయ చదరంగం ఆడుతున్నదని అన్నారు.జీవో ప్రకారం కొత్త డిస్కమ్ పరిధిలోకి 30,60,861 వ్యవసాయ కనెక్షన్లు, 512 లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలు, ఎవీఊాదీ, మిషన్ భగీరథ.. మొత్తంగా 30,62,853 కనెక్షన్లు రైతు డిస్కం కి బదిలీ చేశారని హరీశ్‌రావు తెలిపారు. ఇంత భారీ వ్యవస్థ నిర్వహణ కేవలం 2,000 మంది సిబ్బందితో ఎలా సాధ్యం అవుతుందని ఆయన ప్రశ్నించారు. కేవలం 25శాతం థర్మల్ పవర్ అలకేషన్ తో రైతులకు సాగు, ప్రజలకు తాగు నీళ్లకు అవసరం అయ్యే భారీ విద్యుత్ వ్యవస్థ ఎలా నడుస్తుందని నిలదీశారు. 6,15,651 వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు, 2.51 లక్షల సర్క్యూట్ కిలోమీటర్ల వ్యవసాయ ఎల్‌టీ లైన్లు.. వీటి నిర్వహణకు సరిపడా సిబ్బంది లేకపోతే రైతుల కష్టాలకు ఎవరు బాధ్యత వహిస్తారని అడిగారు.రాష్ట్ర విద్యుత్ కేటాయింపుల్లో ఇప్పటికీ 53.28 శాతం థర్మల్ విద్యుత్తే ఉందని.. సౌర విద్యుత్తు వాటా 35.31 శాతం మాత్రమే అని హరీశ్‌రావు తెలిపారు. ఇందులో థర్మల్ 25%, సోలార్ 58%, హైడల్ మొత్తంగా 100% రైతు డిస్కమ్ కు కేటాయించారని అన్నారు. పగటి పూట మాత్రమే సోలార్ విద్యుత్ ఉత్పత్తి అయితే, రాత్రి పూట ఉండదని చెప్పారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని చెప్పే ప్రభుత్వం.. పగటిపూట మాత్రమే విద్యుత్ ఇచ్చి, రాత్రివేళ రైతులను చీకట్లోకి నెట్టబోతోందా అని అనుమానం వ్యక్తం చేశారు.2325 వీజౌ హైడల్ (జల విద్యుత్) పవర్ మొత్తం

మిగతా 3లో..

# సీఈసీకి చట్ట రక్షణపై రగడ

- 'సర్' అక్రమాలకు పాల్పడినందుకు క్రిమినల్ విచారణ జరుపాలని విపక్షాల డిమాండ్
- సీఈసీ, ఈసీలు క్రిమినల్ చర్యల పరిధిలోకి రాకుండా 2023లో కేంద్రం చట్ట సవరణ



న్యూఢిల్లీ, అక్టోబర్ 13: సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) జరుపుతున్న నిరసనలో ఆ పార్టీ ప్రధాన డిమాండ్లలో ఒకటి సర్ ద్వారా పౌరుల సామూహిక ఓటు హక్కును హరించినందుకు ఆయనపై క్రిమినల్ విచారణ ప్రారంభించడం. అయితే మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టంతో సీఈసీపైన కానీ, ఈసీలపైన కానీ ఎటువంటి క్రిమినల్ చర్యలు చేపట్టేందుకు వీల్లేదు.ఈ చట్టం అమల్లో ఉన్నంతకాలం సీఈసీ, ఈసీలను వారి అధికారిక విధులను నిర్వర్తించినప్పుడు తీసుకున్న చర్యలు, నిర్ణయాలు లేదా ప్రకటనలకు సంబంధించి కోర్టు కేసుల నుంచి రక్షిస్తుంది. సర్‌కు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా సీఈసీ, ఈసీలకు కల్పించిన చట్టపరమైన రక్షణ, రాజ్యాంగ న్యాయ స్థాన న్యాయమూర్తులకు లభించే రక్షణ కన్నా కూడా విస్తృతమైనదిగా ఉండవచ్చని సుప్రీంకోర్టు ఈనెల 5న మౌఖి కంగా వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో సీఈసీ, ఈసీలకు ఈ రక్షణ కల్పించే 2023 చట్టంలోని సెక్షన్ 16పై సర్వత్రా చర్చ నడుస్తు న్నది. నరేంద్ర మోదీ ప్రభుత్వం 2023 ఆగస్టు 10న రాజ్యసభలో ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ), ఎన్నికల కమిషనర్ల (నియామకం, సర్వీసు, షరతులు, పదవీకాలం) బిల్లును ప్రవేశపెట్టినప్పుడు దానిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. సీఈసీ, ఈసీల నియామకాలు చేయడంలో ఈ బిల్లు ప్రభుత్వానికి తిరుగులేని ఆధిపత్యాన్ని కల్పించడమే కాకుండా, జీత భత్యాలు, ఇతర సర్వీసు నిబంధనల విషయంలో సీఈసీ, ఈసీలను క్యాబినెట్ సెక్రటరీతో సమాన స్థాయికి తీసుకురావాలని ఇది కోరుతున్నదనే విషయంపైనా చర్చ జరిగింది.గతంలో

మిగతా 3లో..

## కరువుపై కాంగ్రెస్ సర్కార్ చోద్యం



- ఎల్ నినో హెచ్చరికలను పట్టించుకోని ప్రభుత్వం
- కరువు ముప్పు.. వ్యవసాయం నుంచి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వరకు ప్రభావం
- గోదావరి జలాల వినియోగంపై ఎందుకీ నిర్లక్ష్యం?
- నిపుణుల సూచనలు బేఖాతరు.. విలువైన సమయం వృథా
- ఇప్పటికైనా మేల్కొనాలి.. కరువు నివారణకు కార్యాచరణ అవసరం

వివరాలు 3లో..

# కరువు దెబ్బకు కండ్లు తెరిచిన సర్కార్

- పాలమూరు-రంగారెడ్డి పంపులు ఆన్ చేసేందుకు సన్నాహాలు
- శ్రీశైలం నుంచి నార్లాపూర్‌కు నీటి ఎత్తిపోతలకు ఏర్పాట్లు
- మూడేండ్లుగా ప్రాజెక్టును పడావు పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం
- బీఆర్ఎస్ హెచ్చరిస్తున్నా 2.5కి.మీ పనులు చేపట్టని వైనం



హైదరాబాద్, అక్టోబర్ 13: ఎల్ నినో కరువు పరిస్థితులు. బీఆర్ఎస్ శ్రేణుల అవిశ్రాంత పోరాటం. వెరసి కాం గ్రెస్ ప్రభుత్వం కండ్లు తెరచినట్టున్నది. నీళ్లన్నీ పోయాక ఇప్పుడు పాలమూరు పంపులను ఆన్ చేసేందుకు పూనుకుంటున్నది. అది కూడా మూడు రోజులుగా ఊరిస్తున్నది. పంపులను తిప్పేందుకు మంత్రి రాకకోసం ఎదురుచూస్తున్నది. అయితే నార్లాపూర్‌కు ఎత్తిపోసినా ఒనగూరే ప్ర యోజనం అంతంతే. అదే ఇప్పటికీ పాలమూరు ఎత్తిపోతల్లో కేవలం 2.5 కి.మీ. కాలువను పూర్తిచేసి ఉంటే.. ఈ సీజన్‌లో కరివెన రిజర్వాయర్ వరకూ జలాలను తరలించి నిల్వ చేసుకొనే అవకాశం ఉండేదని విమర్శలు వినిపిస్తున్నాయి.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పను ల్లో వేగం తగ్గింది. నత్తకన్నా నెమ్మదిగా కొనసాగుతున్నాయి. ప్యాకేజీ-3 పనులే ఇందుకు నిదర్శనం. ఈ లిఫ్ట్ స్కీమ్‌లో ప్రధానంగా నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరివెన, ఉద్దండాపూర్ రిజర్వాయర్లు ఉన్నాయి. శ్రీశైలం నుంచి నీటిని ఎత్తిపోసేందుకు కావాల్సిన పంప్‌హౌస్‌లు, ప్రధాన కాలువలతోపాటు, నిల్వ కోసం ఆయా రిజర్వాయర్లు

మిగతా 3లో..

# గేటు దూకి జంతర్ మంతర్‌లోకి..



పోలీసుల అదుపులో సీజేపీ నాయకులు

న్యూఢిల్లీ, అక్టోబర్ 12: ఇతర మద్దతుదారులతో పాటు సీజేపీ కార్యకర్త అజింక్యా షిండేను కూడా అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు కావడానికి ముందు రాంకా ఎక్స్‌లో ఒక వీడియో క్లిప్‌ను పోస్ట్ చేశారు. అందులో, తాను, దాస్, ఇతర సీజేపీ మద్దతుదారులు ఒక గేటు పైనుంచి దూకి జంతర్ మంతర్ ప్రాంగణంలోకి ప్రవేశిస్తున్నట్టు ఆ వీడియోలో ఉంది.ఆయన ఆ వీడియోకు జంతర్ మంతర్ జోలికి రావద్దు అని శీర్షిక పెట్టారు. జంతర్ మంతర్ సమీపంలోని జనతాదళ్(యునైటెడ్) కార్యాలయ ప్రాంగణం వైపు నుంచి ఆ బృందం నిరసన స్థలంలోకి ప్రవేశించినట్టు తెలుస్తున్నది. వెంటనే పోలీసులు ఆ ప్రాంతంలోకి ప్రవేశించిన వారినందరినీ అదుపులోకి తీసుకున్నారు.పోలీసులు

మిగతా 3లో..

## ఐదుగురు పసికందుల మృతికి ఎలుకలే కారణమట..



ఆదిలామంచిర్యాల అక్టోబర్ 13: ఆదిలాబాద్ రిమ్స్ దవాఖానలోని నవజాత శిశువుల సంరక్షణ విభాగానికి (ఎస్ఎన్‌సీయూ) చెందిన ఏసీ వైర్లను ఎలుకలు కొరుకడంతో ప్రమాదం జరిగి, ఐదుగురు పిల్లలు మృతి చెందారని కాంగ్రెస్ సర్కార్ సిగ్గులేకుండా ప్రకటించి, చేతులు ఎత్తేసేందుకు సిద్ధమైంది. సెప్టెంబర్ 21న అర్ధరాత్రి రిమ్స్ దవాఖాన ఎస్ఎన్‌సీయూ వార్డులో 27 మంది పసికందులు చికిత్స పొందుతుండగా, షార్ట్ సర్క్యూట్ జరిగి దట్టమైన పొగల్లో ఊపిరి ఆడక ఐదుగురు పసికందులు ప్రాణాలు కోల్పోవడంతో కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం నవజాత శిశువుల ప్రాణాలను బలిగొందంటూ యావత్ తెలంగాణ సమాజం దుమ్మెత్తిపోసింది.ఈ ఘటనపై సర్కార్ నియమించిన ఆరుగురు సభ్యుల హైలెవల్ కమిటీ ఏసీ వైర్లను ఎలుకలు కొరుకడంతో ప్రమాదం సంభవించిందని 50 పేజీలతో కూడిన నివేదికను అందజేసినట్టు తెలిసింది. సర్కార్ అసమర్థతను కప్పిపుచ్చుకోడానికి ఎలుకలపై నెపం నెడుతూ నివేదిక ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పిల్లలకు చికిత్స అందించే బ్లాక్‌లో ఎలుకలు తిరుగుతుంటే దవాఖాన సిబ్బంది ఏం చేస్తున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రమాదానికి ఎలుకలే కారణమని ఎలా ధ్రువీకరించారు.. సర్కార్‌కు అందజేసిన

మిగతా 3లో..

## బీఆర్ఎస్ ఒత్తిడితో బోనస్..



- సింగరేణిపై దిగొచ్చిన కాంగ్రెస్ సర్కార్
- 596 కోట్ల వాటా చెల్లిస్తున్నట్టు ప్రకటన
- వాస్తవ లాభాలు చెప్పని డిప్యూటీ సీఎం
- మూడేండ్లలో అతి తక్కువ వాటా ఇదే

వివరాలు 3లో..

# అన్నదాతతో సర్కార్ ఆటలు..

- కరువు సమీక్షకు పిలిచి..
- రైతులు వచ్చాక మీటింగ్ రద్దు



హైదరాబాద్, అక్టోబర్ 13: రాష్ట్రంలో పంట పొలాలు ఎండిపోతున్నాయి. పంట చేతికందే దశ లో నీరందక నెర్రలుబారుతున్నది. అది చూడలేక అన్నదాతలు గుండెలు బాదుకుంటున్నారు. ఇలాంటి విపతర సమయంలో రైతులకు అండగా నిలువాల్సిన పాలకులు తమ రాజకీయ ప్రాధాన్యతల ను వెతుక్కుంటూ ఢిల్లీ విమానం ఎక్కారు. రైతుల కష్టాలను తెలుసుకొనేందుకు స్వయంగా ప్రభుత్వమే ఖరారు చేసిన సమీక్షను అర్ధంతరంగా రద్దు చేసి, ముఖ్యమంత్రి మొదలు మంత్రుల వరకు అంతా ఢిల్లీకి వెళ్లడం తీవ్ర చర్చనీయాంశంగా మా రింది. రాష్ట్రం లో నెలకొన్న ఎల్ నినో, కరవు పరిస్థితులపై చర్చించేం దుకు ఈ నెల12న ఉదయం 11 గంటలకు సచివాల యంలో మంత్రులఅనధికారిక క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అక్టోబర్ 9న అధికారిక నోట్ జారీ చేశారు. ఆ భేటీ ముగిసిన వెంటనే మధ్యాహ్నం ఒంటి గంటకు సచివాల యం ఆరో అంతస్తు నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతు వేదికల ద్వారా అన్నదాతలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహి స్తామని, అందులో ముఖ్యమంత్రి, మంత్రులు పాల్గొం టారని స్పష్టంగా పేర్కొన్నారు. క్షేత్రస్థాయి

మిగతా 3లో..

## గీవెన్స్ ఫిర్యాదులకు మోక్షమేదీ!..



- అవస్థలు పడుతున్న వినియోగదారులు
- రోజులు గడుస్తున్నా పరిష్కారం శూన్యం..
- జలమండలిపై వెల్లువెత్తుతున్న విమర్శలు

వివరాలు 3లో..

# నేడు సింగరేణి గర్జన

- గోదావరిఖనిలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ
- హాజరుకానున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కాంగ్రెస్ మోసాలపై కదం తొక్కనున్న కార్మికులు

వివరాలు 2లో..



## పండుగల వేళ కేంద్రం ఊరట



- ఛార్జీల మోతపై తాజా నిర్ణయం..!

వివరాలు 4లో..

బలగం TV BALAGAM
balagamtv100@gmail.com

# కారుణ్య నియామక పత్రాలు అందజేత

చుంచుపల్లి, అక్టోబర్ 13 : దసరా పండుగ సందర్భంగా మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు అండగా నిలుస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ సీఈవో బి.నాగలక్ష్మి ముగ్గురికి కారుణ్య నియామకాలు కల్పించారు. అంబేద్కర్ నగర్‌లో పనిచేస్తూ మరణిం చిన ఉద్యోగి కుమారుడు జీ.తరుణ్‌కు గుండాల మండల పరిషత్ కార్యాలయంలో, పెనగడప పాఠశాలలో నైట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తూ మరణించిన విజయ్ కుమార్ కుమారుడు పూర్ణచంద్రరావుకు ములకలపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా నియామకాలు కల్పించారు. అలాగే, అన్నపురెడ్డిపల్లి మండలం ఊటుపల్లి పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తూ మరణించిన రాము భార్య టి.వెంకటలక్ష్మికి మద్దుకూరు జడ్పీహెచ్‌ఎస్‌లో ఆఫీస్ సబార్డినేట్‌గా నియామకం కల్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ పంచాయ తీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పులికంటి వెంకటేశ్వర్లు సీఈవో బి. నాగలక్ష్మికి సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే ఈ చర్య అభినందనీయమని పేర్కొన్నారు.

# కాంగ్రెస్ అసమర్థ పాలనతో రైతులకు తీవ్ర నష్టం : పువ్వాడ అజయ్ కుమార్



హైదరాబాద్, అక్టోబర్ 13: కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనతో రాష్ట్రంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వారి పరిస్థితి ఆందోళనకరంగా మారిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. రాష్ట్రంలో నెలకొంటున్న కరువు పరిస్థితులు, సాగునీరు, విద్యుత్ కొరతతో అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంపై గత తొమ్మిది నెలలుగా ప్రపంచ వాతావరణ నిపుణు లు హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు, విద్యుత్ అందించడంలో ప్రభుత్వం విఫలమైందని రైతులకు అవసరమైన నీరు, విద్యుత్ అందించలేని పరిస్థితి నెలకొనడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. రైతుల సమస్యలపై తక్షణమే స్పందించి, సాగునీరు, విద్యుత్ సరఫరాను మెరుగుపరిచేం దుకు ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ ఇదే వైఖరిని కొనసాగిస్తే ప్రజాగ్రహాన్ని ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

# ఓఆర్‌ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం..

## ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్ట్ సత్యనారాయణ మృతి



హైదరాబాద్, అక్టోబర్ 13: ప్రముఖ మిమిక్రీ, వెంట్రిలాక్విజం, మ్యాజిక్ కళాకారుడు సత్యనారాయణ (40) రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్)పై ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఆయన మృతి చెందడం కళారంగంలో విషాదాన్ని నింపింది. బతుకమ్మ వేడుకల్లో ప్రదర్శన ముగి ంచుకుని ఇంటికి తిరిగి వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసు కుంది. వివరాల్లోకి వెళ్తే.. హకీంపేటలో ఆదివారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో తన కళా ప్రదర్శనను ముగించుకున్న సత్యనారాయణ కారులో హయత్‌నగర్ వైపు బయలుదేరారు. ఈ క్రమంలో ఓఆర్‌ఆర్‌పై ప్రయాణిస్తుండగా వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం ఆయన కారును ఢీకొట్టింది. దీంతో కారు అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సత్యనారాయణ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. యాక్సిడెంట్‌పై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన వాహనాం ఆచూకీ కోసం విచారణ చేస్తున్నారు.

### 5 ఏళ్లుగా కళారంగంలో విశేష సేవలు

సత్యనారాయణ గత 15 ఏళ్లుగా మిమిక్రీ, వెంట్రిలాక్విజం, మ్యాజిక్ రంగాల్లో కళాకారుడిగా కొనసాగుతున్నారు. తన ప్రతిభతో ఇప్పటివరకు 2 వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చిన ఆయన పలువురిని అలరించారు. వివిధ కార్యక్రమాల్లో తన కళా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ గుర్తింపు పొందారు. కళాకారుడిగా కొనసాగుతున్న సత్యనారాయణ అకాల మరణం ఆయన కుటుంబ సభ్యులతో పాటు సహచర కళాకారులను తీవ్ర విషాదంలో ముంచింది. సత్యనారాయణ మృతిపై తెలంగాణ ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు సామల వేణుతో పాటు పలువురు కళాకారులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి కళారంగానికి తీరని లోటని తెలిపారు.

# ఓటరు పేరు తొలగిస్తే కారణాలు వివరిస్తాం

## హైకోర్టుకు ఎన్నికల సంఘం వివరణ



హైదరాబాద్, అక్టోబర్ 13: ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన వారి పేర్లను తుది జాబితా నుంచి తొలగిస్తే అందుకు కారణాలను వివరిస్తూ ఉత్తర్వులు జారీచేస్తామని భారత ఎన్నికల సంఘం హైకోర్టుకు స్పష్టంచేసింది. నోటీసులకు స్పందించి విచారణకు హాజరై, వివరాల్లో వ్యత్యాసాలను సరిచేసేందుకు అవసరమైన పత్రాలు సమర్పించిన ఓటర్ల విషయం లో ఈ విధానం అనుసరిస్తామని తెలిపింది.కారణాలతో కూడిన ఉత్తర్వులపై అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందని, ఒకవేళ ఎలాంటి ఉత్తర్వు లు జారీ చేయకపోతే సంబంధిత ఓట రు పేరు జాబితాలో ఉన్నట్టుగా పరిగణించవచ్చని వెల్లడించింది. హైదరాబాద్‌కు చెందిన సామాజిక కార్యకర్త ఎస్క్యూ మసూద్, ఆయన సోదరుడు సయ్యద్ వహీదుద్దీన్ చేసిన ఫిర్యాదులను పరిష్కరించామని తెలిపింది. మరికొన్ని అంశాలు పరిశీలనలో ఉన్నాయ ని ఈసీ తరఫు న్యాయవాది అవినాశ్ దేశాయ్ ధర్మాసనానికి వివరించారు. ఈసీఐ.నెట్, ఈఆర్ ఓనెట్ అప్లికేషన్ల ద్వారా ఆటోమేటిక్ డాటా మ్యాచింగ్ విధానంలో ఓటర్ల వివరాల్లో వ్యత్యాసాలను గుర్తించి నోటీసులు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ మసూద్, ఇతరులు దాఖలు చేసిన పిటిషన్‌పై తాతాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పీ శామ్‌కోషి, జస్టిస్ నందికొండ నర్సింగరావుతో కూడినధర్మాసనంమంగళవారం విచారణచేపట్టింది.ఆయన దరఖాస్తును ఆమోదిస్తే తుది జాబితాలో పేరు ప్రచురిస్తామని, లేదంటే దరఖాస్తుపై తగిన నిర్ణయం తీసుకుంటామని వివరించారు.

# దుబాయ్‌లో GTF ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు..









హైదరాబాద్, అక్టోబర్ 13: గల్ఫ్ తెలంగాణ ఫోరం (GTF) ఆధ్వర్యంలో అక్టోబర్ 11న దుబాయ్‌లో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను విదేశీ గడ్డపై ఘనంగా నిర్వహించి తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పారు. దుబాయ్‌లో నివసిస్తున్న తెలం గాణ ప్రాంత ప్రజలు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత కాన్సులేట్ జనరల్ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి హాజరయ్యారు. తెలంగాణ నుంచి విచ్చేసిన మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి , కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ , నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ , నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే గణేశ్ బిగాల , ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్ , ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి , బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ , బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం అధ్యక్షుడు మహేశ్ బిగాల , రాష్ట్ర నాయకురాలు ఐశ్వ షకీల్ తదితర ప్రముఖులు ఈ వేడుకల్లో పాల్గొని కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జీటీఎఫ్ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ ఆకుల సురేందర్ పటేల్ ఆధ్వర్యంలో జనరల్ సెక్రటరీలు బాలరాజ్ గౌడ్ , యుజ్వేంద్ర , వైస్ ప్రెసిడెంట్లు శ్రీకాంత్ , రాజేశ్ , కోఆర్డినేటర్ రాజేశ్వర్, అభినవ్, చంద్రకాంత్ గుప్తా, రవన్నతో పాటు జీటీఎఫ్ కోఆర్డినేటర్లు, కార్యవర్గ సభ్యులు, వాలంటీర్లు సమష్టిగా కృషి చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మహిళా విభాగం తరపున కళ్యాణి, లక్ష్మీ అక్క, కల్పన, మమత, ఉషశ్రీ, వైదేవి, వేద, స్వాతి, లక్ష్మీసతీశ్ రెడ్డి , సీ.ఎస్.ఆర్ , ఆనంద్ రెడ్డి , ప్రశాంత్ , మహేశ్, రాజ్‌కుమార్ గారు, రజనీకాంత్, వెంకటేశ్, నక్క లక్ష్మణ్, అనుషా శ్రీకాంత్ , అనుషా , శ్రీహరి రెడ్డి , కేశవిని సతీష్, ఉదయ్ కుమార్ , శ్వేత, అరుంధతి రాజ్ , మురళి, రజిత , సునీత, సుధా , శేఖర్ , లీల , సంపత్ కుమార్, జీటీఎఫ్ బృందంలోని ప్రతి ఒక్కరి సమిష్టి సహకారంతో బతుకమ్మ సంబరాలను విజయవంతం చేయగలిగాము. అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. తదితర మహిళా సభ్యులు చురుకుగా పాల్గొని బతుకమ్మ సంబరాలను సంప్రదాయబద్ధంగా, ఎంతో ఉత్సాహంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలు, తెలంగాణ ఆడపడుచుల ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.

### తెలంగాణ సంప్రదాయ వంటకాలతో విందు

తెలంగాణలోని పల్లె సంస్కృతిని, సంప్రదాయాలను గుర్తు చేస్తూ చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ ఆనందోత్సాహాలతో ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన అతిథులు, తెలంగాణ ప్రవాసులు, కుటుంబ సభ్యులందరికీ జీటీఎఫ్ ఆధ్వర్యంలో చక్కటి ఏర్పాట్లు చేసి, రుచికరమైన తెలంగాణ సంప్రదాయ వంటకాలతో విందు భోజనాలు ఏర్పాటు చేశారు. వచ్చిన ప్రతి ఒక్కరికీ ఆత్మీయ ఆతిథ్యం అందిస్తూ, అందరూ సంతోషంగా వేడుకల్లో పాల్గొనేలా నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. తెలంగాణ సంస్కృతిని భావితరాలకు అందించడమే జీటీఎఫ్ ప్రధాన లక్ష్యం విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ మన భాష, సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలను భావితరాలకు పరిచయం చేయాలనే లక్ష్యంతో జీటీఎఫ్ నిరంతరం కృషి చేస్తోందని నిర్వాహకులు తెలిపారు.బతుకమ్మ సంబరాలకు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి అతిథికి, తెలంగాణ నాయకులకు, మహిళలకు, యువతకు, కుటుంబ సభ్యులకు, దాతలకు, స్పాన్సర్లకు, వాలంటీర్లకు జీటీఎఫ్ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరూ జీటీఎఫ్ కుటుంబంలో భాగస్వాములేనని, అందరి సమష్టి కృషి, సహకారం, ఆత్మీయత వల్లే ఈ బతుకమ్మ సంబరాలు ఇంతటి ఘనవిజయాన్ని సాధించాయని జీటీఎఫ్ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ ఆకుల సురేందర్ పటేల్ గారు పేర్కొన్నారు.

# రైతుల భూములను బలవంతంగా లాక్కుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## సబితా ఇంద్రా రెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 13: రాష్ట్రంలో ఎవరికి భరోసా ఇవ్వని పాలన నడుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం పంటలకు సాగు నీళ్లు, ప్రజల కు తాగునీళ్లు ఇవ్వలేమని చెప్పడం సిగ్గుచేటు. నాడు రైతులను కేసీఆర్ అన్ని విధాల ఆదుకున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఆమె తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో పాలన అస్తవ్యస్థంగా మారింది. మంత్రులు నేల విడిచి సాము చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ వచ్చి రాగానే మెట్రో విస్తరణ ప్రాజెక్టును రద్దు చేశారు. ఇపుడు బుల్లెట్ ట్రైన్ తీసుకొస్తామని చెబుతున్నారు. రైతుల భూములు ప్రభుత్వ భూములని బలవంతంగా సేకరిస్తున్నా రని విమర్శించారు. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు అలైన్ మెంట్ ఖరారు కాలేదని రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్ స్పష్టం చేశారు. బుల్లెట్ ప్రాజెక్టు ఎక్కడ వస్తుందో తెలియనప్పుడు బహదూర్ గూడ రైతుల భూములను పోలీసుల పహారాలో ఎందుకు లాక్కున్నారో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎవరి ప్రయోజనాల కోసం ఇదంతా చేస్తున్నారని ప్రశ్నించారు. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కన్నా సీఎంకు సొంత ప్రయోజనాలు ఎక్కువయ్యాయని మండిపడ్డారు. రంగారెడ్డి జిల్లాలో నలుమూలల బలవంతపు భూముల సేకరణ జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.దేని కోసమో చెప్పకుండా భూ సేకరణ చేసి రైతులను ఇబ్బందులు పెడుతున్నారు. నిన్న లగచర్లలో బలవంతపు భూ సేకరణకు నిరసనగా రైతు ఆత్మ హత్యయత్నానికి పాల్పడ్డారు. వేల ఎకరాలు లాక్కొని రైతులను సీఎం రోడ్డున పడేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్వాల్ గూడ నుంచి కొడంగల్ కు పెద్ద రోడ్డు వేస్తున్నారు. ఇప్పటికే శంషా బాద్ నుంచి మంచి రోడ్డు ఉంది. ఇంకో రోడ్డు దేనికోసమని నిలదీశారు. సీఎం భూ దాహానికి హద్దే లేదా ? నా నియోజకవర్గంలో గ్రీన్ ఫీల్డ్ హైవే పేరిట రైతుల భూములను అవసరం లేకున్నా సేకరించారన్నారు. రైతులు ప్రభుత్వ తీరుతో భయభ్రాంతులకు లోనవుతన్నారు.నాదర్ గుల్ ప్రభుత్వ భూములను ప్రైవేట్ భూముల అంటూ అక్కడికి ఎవరిని వెళ్లనివ్వడం లేదు. చట్ట విరుద్ధంగా బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుకు హద్దులు పాతడంపై కేంద్ర మంత్రి జి .కిషన్ రెడ్డి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూ దందాలు, అరాచకాలకు సీఎం వెంటనే తెరదించాలన్నారు. కార్యక్రమంలోఎమ్మెల్సీ సురభి వాణీ దేవి, మాజీ ఎమ్మెల్యేలు పట్నం నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మంచి రెడ్డి కిషన్ రెడ్డి, రాజేంద్ర నగర్ బీఆర్ఎస్ ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ విగ్రహ ధ్వంసంపై పద్మా దేవేందర్‌రెడ్డి ఆగ్రహం



మెదక్, అక్టోబర్ 13: మెదక్ పట్టణంలోని వెల్‌కమ్ బోర్డు సమీపంలో వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంపై మాజీ ఉపసభాపతి పద్మా దేవేందర్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండించిన ఆమె.. విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ధ్వంసమైన విగ్రహాన్ని తక్షణమే పునరుద్ధరించాలని కోరారు. విగ్రహం సమీపంలో నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన ప్పటికీ ఒక్కటీ పనిచేయకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయమై మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పద్మా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. భూమి, భుక్తి, ఆత్మగౌరవం కోసం నిజాం పాల కులు, రజాకార్లకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ తెలంగాణ పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. అలాంటి మహనీయురాలి విగ్రహాన్ని ధ్వంసం చేయడం బాధాకరమన్నారు. మహనీయుల విగ్రహాల పట్ల ఇటు వంటి చర్యలకు పాల్పడేవారిని ఉపేక్షించకూడదని, నిందితులను గుర్తించి చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని స్పష్టం చేశారు. సమాజానికి స్ఫూర్తినిచ్చే మహనీయుల చరిత్రను భావితరాలకు తెలియజేయడంలో వారి విగ్రహాలకు ఎంతో ప్రాధాన్యం ఉందని పేర్కొన్నారు.విగ్రహం సమీపంలో నాలుగు సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ ఒక్కటీ పనిచేయకపోవడంపై పద్మా దేవేందర్‌రెడ్డి ప్రశ్నలు సంధించారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమె రాలు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అనే విషయాన్ని పోలీ సులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. నేరాల నియంత్రణతో పాటుఘటనలకుపాల్పడిన వారిని గుర్తిం చడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అలాంటి కెమెరాలు పనిచేయకపోతే వాటిని ఏర్పాటు చేయడం వల్ల ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. ఒక కీలక ఘటన జరిగిన తర్వాతే కెమెరాలు పనిచేయడం లేదనే విషయం వెలుగు లోకి రావడంఅధికారులపర్యవేక్షణలోపాలను సూచిస్తోందని అన్నారు.

### డీఎస్పీతో ఫోన్‌లో మాట్లాడిన పద్మా దేవేందర్‌రెడ్డి

చాకలి ఐలమ్మ విగ్రహ ధ్వంసం ఘటనపై డీఎస్పీ ప్రసన్నకుమార్‌తో ఫోన్‌లో మాట్లాడిన పద్మా దేవేం దర్‌రెడ్డి.. నిందితులను త్వరగా గుర్తించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పనిచేయని సీసీ కెమెరాలను వెంటనే మర మ్మతు చేయించి, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా చూడాలని సూచించారు. పట్టణంలో ఏర్పాటు చేసిన కెమెరాల పనితీరును నిరంతరం పర్యవేక్షించడంతో పాటు, ప్రతి నెలా వాటిని తనిఖీ చేసే విధానాన్ని అమలు చేయాలని కోరారు. సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.విగ్రహ ధ్వంసం ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను గుర్తించాలని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీఎస్పీని కోరినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని పేర్కొన్నారు.సీసీ కెమెరాల నిర్వహణ విషయంలో పోలీసులతో పాటు మున్సిపల్ అధికారులు, సిబ్బంది కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని పద్మా దేవేందర్‌రెడ్డి సూచించారు. కెమెరాల నిర్వహణ బాధ్యత ఏ శాఖ పరిధిలో ఉన్నప్పటికీ, అవి నిరంతరం పనిచేసేలా సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలు, మహనీయుల విగ్రహాలు ఉన్న ప్రదేశాల్లో భద్రతా ఏర్పాట్లను సమీక్షించాలని కోరారు.ధ్వంసమైన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని తక్షణమే పునరుద్ధరించడంతో పాటు, ఆ ప్రాంతంలో తగిన రక్షణ ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడం ఎంత ముఖ్యమో, వాటిని పరిరక్షించడం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. ఈ ఘటనకు బాధ్యులను గుర్తించి శిక్షించడంతో పాటు, పట్టణంలోని ఇతర విగ్రహాల వద్ద భద్రతను పటిష్ఠం చేయాలని పద్మా దేవేందర్‌రెడ్డి కోరారు.

# నేడు సింగరేణి గర్జన

## గోదావరిఖనిలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ

## హాజరుకానున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## కాంగ్రెస్ మోసాలపై కదం తొక్కనున్న కార్మికులు



గోదావరిఖని, అక్టోబర్ 13: అధికారంకోసం హామీలిచ్చి గద్దెనెక్కగానే మొండిచెయ్యి చూపిన కాంగ్రెస్‌పై కదంతొక్కేందుకు సింగరేణి కార్మికలోకం సిద్ధమవుతున్నది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే 'సింగరేణి కార్మిక గర్జన' భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తికాగా పెద్ద సంఖ్యలో తరలివచ్చేందుకు నల్ల సూర్యులు ఉత్సాహంగా ఉన్నారు. దాదాపు 30 వేల మంది పాల్గొంటారని భావిస్తున్న సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.రెండు రోజులుగా బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు సభ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించి దగ్గరుండి పనులు పర్యవేక్షించారు. టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షుడు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ మంత్రి గంగుల కమలాకర్, ప్రభుత్వ మాజీ విప్ బాల్క సుమన్, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీశ్‌రెడ్డి, కౌశిక హరి, కోలేటి దామోదర్, మూల విజయారెడ్డి సభ విజయవంతం కోసం విశేషంగా కృషి చేస్తున్నారు. సభకు రామగుండం, మంథని నియోజకవర్గాలతోపాటు మంచిర్యాల జిల్లాలోని శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు తరలిరానున్నారు.

బలగం TV BALAGAM
balagamtv100@gmail.com

**(మొదటిపేజీ తరువాయి)**

## సీఈసీకి చట్ట రక్షణపై రగడ

వారు సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో సమాన స్థాయిలో ఉండేవారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో సమాన స్థాయిని అనుభవించిన సీఈసీ, ఈసీలకు ఆ స్థాయిని ప్రతిపాదిత చట్టం ద్వారా తొలగించాలని చూడడం పట్ల కూడా విపక్ష పార్టీలు అభ్యంతరం తెలిపాయి. విపక్షాల అభ్యంతరాల నడుమ ఈ చట్టం పార్లమెంట్ ఆమోదం పొందింది. ఈ చట్టంలోని మరో ప్రధాన అంశం సీఈసీ, ఈసీలు తమ అధికారిక హోదాలో చేసే అన్ని చర్యలకు చట్టపరమైన రక్షణ పొందుతారు. అంటే వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకొనేందుకు చట్టం అనుమతించదు. అయితే సభ్యులకు మొదట అందించిన బిల్లు ప్రతిలో లేని ఒక నిబంధన చివరకు చట్టంలో చేరింది. 2023 డిసెంబర్ 12న రాజ్యసభలో బిల్లును ప్రవేశపెట్టిన సందర్భంగా కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, ఎన్నికల కమిషనర్లకు కీలకమైన చట్టపరమైన రక్షణ కల్పించే కొత్త క్లాజ్ 15ఏను చేర్చాలని సవరణ ప్రతిపాదించారు. చర్చ చివరలో ప్రవేశపెట్టిన ఈ సవరణ ఎలాంటి చర్చ లేకుండానే ఆమోదం పొందింది. అనంతరం రాజ్యసభ చైర్మన్ దానిని క్లాజ్ 16గా చేర్చేందుకు ఒగీకరించారు.'ప్రస్తుతం అమల్లో ఉన్న ఇతర చట్టాల్లో ఏది ఎలా ఉన్నప్పటికీ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా లేదా ఎన్నికల కమిషనర్‌గా ఉన్న లేదా గతంలో పనిచేసిన ఏ వ్యక్తిపైనా, తన అధికారిక విధులు లేదా బాధ్యతలు నిర్వర్తించే సమయంలో లేదా వాటిని నిర్వర్తిస్తున్నట్టు భావించి చేసిన ఏ చర్య, పని లేదా వ్యాఖ్యకు సంబంధించి ఏ న్యాయస్థానమూ సివిల్ లేదా క్రిమినల్ విచారణను స్వీకరించకూడదు లేదా కొనసాగించకూడదు' అని ఈ సెక్షన్ పేర్కొంటున్నది. సీఈసీ, ఈసీలు వారి అధికారిక విధుల నిర్వహణలో తీసుకునే చర్యలకు న్యాయపరమైన చర్యల నుంచి శాశ్వత రక్షణ కల్పించే 2023 నాటి చట్టంలోని నిబంధనను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు మంగళవారం అంగీకరించింది. కేంద్రంతో పాటు కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులిచ్చింది.

## ఉచిత విద్యుత్‌కు ఎసరు పెట్టే కుట్ర..

రైతు డిస్కమ్‌కే కేటాయించారని హరీశ్‌రావు తెలిపారు. కానీ ఈ హైడల్ పవర్ సాంకేతికంగా ఏడాదిలో కేవలం 3-4 నెలలు మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు. అంటే మిగతా 8 నెలలు రైతు డిస్కమ్‌కి ఈ విద్యుత్ అందుబాటులో ఉండదు. అప్పుడు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. కొత్త డిస్కమ్‌కు భారీ రుణాలు, బకాయిలను కేటాయిస్తూ.. దాని ఆర్థిక స్థిరత్వంపై ప్రభుత్వం ఏం భరోసా ఇస్తోంది? ఈ అప్పుల భారం చివరకు రైతులపై పడేయాలని చూస్తున్నారా? రైతు డిస్కమ్ పేరుతో వ్యవసాయ విద్యుత్ బాధ్యతలను వేరుచేసి, రేపు నష్టాల సాకుతో రైతులపై ఆంక్షలు విధించే ప్రమాదం లేదా అని నిలదీశారు.రైతులకు ఉచిత విద్యుత్ కొనసాగుతుందని, 24 గంటల సరఫరాలో ఎలాంటి కోతలు ఉండవని ప్రభుత్వం లిఖితపూర్వక హామీ ఇవ్వగలదా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రైతుల అనుమానాలను నివృత్తి చేయకుండా ఏకపక్షంగా ముందుకు వెళ్లడం కుదరదని అన్నారు. కొత్త సంస్థ ఏర్పాటుతో అదనపు పరిపాలనా ఖర్చులు ఎంత? ఆ ఖర్చులను ఎవరు భరిస్తారు? ఆస్తులు, అప్పులు, ఉద్యోగుల బదిలీపై పూర్తి వివరాలను ప్రభుత్వం బహిర్గతం ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. రైతుల పేరుతో డిస్కమ్ ఏర్పాటు చేయడం గొప్ప కాదు.. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడం ముఖ్యం. సంస్థల పేర్లు మార్చడం, కొత్త సంస్థలు ఏర్పాటు చేయడం కాదు.. రైతుల విద్యుత్ సమస్యలకు పరిష్కారం చూపాలని సూచించారు.రైతుల ప్రయోజనాలే లక్ష్యమైతే వారి అభ్యంతరాలను పక్కనపెట్టి ఎందుకు ముందుకెళ్తున్నారు? ఉద్యోగ సంఘాలు, విద్యుత్ రంగ నిపుణులు లేవనెత్తిన సందేహాలకు సమాధానం చెప్పకుండా చాటు మాటుగా జీవో జారీ చేయడం వెనుక ఉద్దేశం ఏమిటి అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రైతులకు భరోసా ఇవ్వాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతుల్లో అనుమానాలు, ఆందోళనలు ఎందుకు పెంచుతోందని అన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరాపై స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. రైతు డిస్కమ్ వల్ల కలిగే ప్రయోజనాలు, ఆర్థిక భారం, సిబ్బంది నిర్వహణపై పూర్తి వివరాలు వెల్లడించాలని సూచించారు. రైతుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా ముందుకు వెళ్లకూడదని చెప్పారు. రైతు డిస్కమ్ ఏర్పాటు వెనుక రైతుల ప్రయోజనాలే లక్ష్యమైతే మా ప్రశ్నలకు సమాధానం చెప్పాలి.. లేదంటే తక్షణం జీవో ఉపసంహరించుకోవాలి అని యావత్ రైతాంగం పక్షాన డిమాండ్ చేశారు.

## కరువు దెబ్బకు కండ్లు తెరిచిన సర్కార్

సైతం బీఆర్ఎస్ హయాంలోనే పూర్తయ్యాయి. నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్‌కు మధ్య ప్యాకేజీ-3లో కేవలం 2.5 కి.మీ. కాలువ పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఓపెన్ కెనాల్ మొత్తం పొడవు 8.325 కిలోమీటర్లు. కేసీఆర్ హయాంలో దాదాపు 6 కి.మీ. నిర్మాణం పూర్తయింది. కేవలం నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం తీర్నాంపల్లి, కొల్లాపూర్ మండలం కుడికిళ్ల మధ్యన 2.5 కి.మీ. ఓపెన్ కెనాల్ తవ్వకం మిగిలి ఉన్నది. కాంగ్రెస్ సర్కార్ ఈ భాగాన్ని పూర్తిచేసి ఉంటే ప్రస్తుతం శ్రీశైలం నుంచి ఉద్దండాపూర్ రిజర్వాయర్ వరకు కృష్ణా జలాలను ఎత్తిపోసుకొని నిల్వ చేసుకునే అవకాశం ఉండేది. తద్వారా ఆయా రిజర్వాయర్ల పరిధిలోని గ్రామాల్లో భూగర్భజలాలు పెరుగడంతోపాటు, నీటికరువును ఎంతో కొంతయినా అధిగమించే పరిస్థితి ఉండేది. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్యాకేజీ-3 పనులను పెండింగ్‌లోనే పెట్టింది.

## గేటు దూకి జంతర్ మంతర్‌లోకి..

తమను అదుపులోకి తీసుకుంటున్నప్పుడు రాంకా, ఇతర సీజేపీ మద్దతుదారులు ఇంక్విలాబ్ జిందాబాద్, భారత్ మాతా కీ జై అని నినాదాలు చేస్తున్న వీడియోను కూడా దాస్ ఎక్స్‌లో పోస్ట్‌చేశారు. జంతర్ మంతర్‌ను స్వాధీనం చేసుకున్నామని ప్రకటించిన ఆయన లోపలికి ప్రవేశించడాన్ని యువతరానికి ఒక సందేశంగా అభివర్ణించారు.

## అన్నదాతతో సర్కార్ ఆటలు..

పరిస్థితులను తెలుసుకొని రైతాంగానికి తక్షణ భరోసా కల్పించడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమని సర్క్యులర్‌లో తెలిపారు. ఈ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ యంత్రాంగం రంగంలోకి దిగి గ్రామాల్లోని రైతులను రైతు వేదికల వద్దకు రప్పించింది. తీరా సమావేశ సమయం దగ్గరపడుతున్న వేళ ప్రభుత్వ నిర్ణయాలు రైతులను తీవ్ర గందరగోళానికి గురిచేశాయి. ఉదయం 9:52 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ రద్దయిందని ఒక సందేశం పంపారు. ఆ తర్వాత కాసేపటికే ఉదయం 11:15 గంటలకు సమావేశం ఉంటుందని రైతులకు సమాచారం ఇచ్చారు. మళ్లీ కొద్దిసేపటికే మధ్యాహ్నం ఒంటి గంటకు సమావేశం జరుగుతుందని, అయితే ముఖ్యమంత్రి రారని, డిప్యూటీ సీఎం, వ్యవసాయ శాఖ మంత్రి మాత్రమే మాట్లాడుతారని తెలిపారు. ఒకవైపు గ్రామాల్లో ఎండిన పైర్లతో రైతులు ఆందోళన చెందుతుంటే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గోవా పర్యటనను ముగించుకొని నేరుగా ఢిల్లీ వెళ్లారు. ఆయనతోపాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ సహా పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మూకుమ్మడిగా ఢిల్లీ బాట పట్టారు. బయటికి ఢిల్లీలో జరిగే నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లినట్టు చెప్తున్నప్పటికీ, అధిష్ఠానం వద్ద పార్టీ అంతర్గత వ్యవహారాలు, పదవుల సర్దుబాటు లెకలు తేల్చుకోవడానికే నాయకులంతా హస్తినకు వెళ్లారనే ప్రచారం జరుగుతున్నది. పొలాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించడం కంటే రాజకీయ సమీకరణలే ప్రభుత్వానికి ముఖ్యమయ్యాయా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

## ఐదుగురు పసికందుల మృతికి ఎలుకలే కారణమట..

నివేదిక బయటికి రాకుండా ఎందుకు గోప్యంగా ఉంచుతున్నారు.. అన్న ప్రశ్నలకు సర్కార్ సమాధానం చెప్పకుండా తప్పించుకునే కుట్రలు చేస్తున్నది. చిన్నారుల మృతికి ఎలుకలను బాధ్యులను చేస్తూ ..అసలైన దోషులను తప్పించే యత్నం చేస్తున్నట్టు సమాచారం. ప్రమాదం జరిగిన సమయంలో ఎస్ఎన్‌సీయూలో 27 మంది చిన్నారులు ఉండగా గంటల వ్యవధిలో ముగ్గురు చిన్నారులు, చికిత్స పొందుతూ మరో ఇద్దరు చిన్నారులు మరణించిన విషయం తెలిసిందే. వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దవాఖానను సందర్శించి విచారణ కమిటీ వేస్తున్నామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మకరందు చైర్మన్‌గా విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ రిమ్స్‌లో వైద్యులు, సిబ్బంది, రోగుల బంధువులతో పాటు పలువురిని పిలిపించుకుని ప్రమాద ఘటనపై వివరాలు సేకరించింది.

# స్టార్‌లింక్‌ను బ్యాన్ చేయండి..

- స్వదేశీ జాగరణ్ మంచ్ డిమాండ్

**న్యూఢిల్లీ:** భారత్‌పై బిలియనీర్ ఎలన్ మస్క్ చేసిన వ్యాఖ్యలను స్వదేశీ జాగరణ్ మంచ్ ఖండించింది. భారత్‌లో స్టార్‌లింక్ ఎంట్రీపై బ్యాన్ విధించాలని ఎస్‌జేఎం జాతీయ కో-కన్వీనర్ అశ్వనీ మహాజన్ డిమాండ్ చేశారు. స్టార్‌లింక్ సేవలతో జాతీయ భద్రతకు ముప్పు ఏర్పడుతుందన్నారు. ఇండియాలో కమర్షియల్ బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందించేందుకు ఎలన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ కంపెనీ లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకున్నది. కానీ భారత వర్గాల నుంచి ఇప్పటి వరకు ఎటువంటి స్పందన రాలేదు. ఆ అప్లికేషన్‌ను తిరస్కరించలేదు కూడా. జాతీయ భద్రత అంశంలో వివరణ ఇచ్చేందుకు మస్క్ కంపెనీ వ్యతిరేకించిందని, తమకు కావాల్సిన రీతిలో స్టార్‌లింక్ స్పందించడం లేదని ఎస్‌జేఎం తన ప్రకటనలో పేర్కొన్నది. ప్రజలను వత్తిడికి గురిచేసి, లైసెన్సు కోసం ప్రభుత్వంపై వత్తిడి పెంచేందుకు మస్క్ ప్రయత్నిస్తున్నట్లు మహాజన్ ఆరోపించారు. లేజర్ ఆధారిత శాటిలైట్ లింకుల ద్వారా స్టార్‌లింక్ సంస్థ డేటాను ట్రాన్స్‌ఫర్ చేస్తుందని అన్నారు. అయితే ఈ విధానం వల్ల భారతీయ డేటా బైపాస్ కాకుండా ఉండేందుకు ఆ వ్యవస్థలను ఇంకా పరీక్షిస్తున్నారని మహాజన్ తెలిపారు. ప్రభుత్వానికి లోబడే స్టార్‌లింక్ తన సేవల్ని విస్తరించుకోవాల్సి ఉంటుందని ఆయన అన్నారు. కానీ స్టార్‌లింక్ మాత్రం ప్రభుత్వ షరతు అంగీకరించడం లేదు. వాళ్లు వాడే టెక్నాలజీకి కూడా అనుమతి లేదని ఎస్‌జేఎం నేత అన్నారు. ఉక్రెయిన్, ఇరాన్, రష్యా, చైనా, తైవాన్, దక్షిణ కొరియా, బ్రెజిల్, వెనిజులా, సుడాన్ దేశాల అనుభవం ఆధారంగా స్టార్‌లింక్ సేవలపై భద్రతా భయాందోళనలు కలుగుతున్నట్లు అశ్వనీ మహాజన్ అన్నారు.

# బీఆర్ఎస్ ఒత్తిడితో బోనస్..

- సింగరేణిపై దిగొచ్చిన కాంగ్రెస్ సర్కార్
- 596 కోట్ల వాటా చెల్లిస్తున్నట్టు ప్రకటన
- వాస్తవ లాభాలు చెప్పని డిప్యూటీ సీఎం
- మూడేండ్లలో అతి తక్కువ వాటా ఇదే



**కరీంనగర్, అక్టోబర్13 :** సింగరేణి కార్మికులకు కాంగ్రెస్ సర్కార్ మరోసారి ధోకా ఇచ్చింది. నల్ల సూర్యుల తరఫున ఈ నెల 14న 'కార్మిక గర్జన సభ' పెడుతున్నట్టు బీఆర్ఎస్ ప్రకటించగానే ప్రభుత్వం భయపడి హడావుడిగా లాభాల వాటా ప్రకటించింది. కానీ అందులోనూ నిలువునా కోత పెట్టింది. నిరుటి కంటే తక్కువ బోనస్‌కే పరిమితమైంది. నిరుడు ఒక్కో కార్మికుడికి రూ.1.95 లక్ష లు బోనస్‌గా ఇస్తే.. ఈ ఏడాది కేవలం రూ.1.53 లక్షల బోనస్‌కే సర్కార్ సరిపుచ్చింది. నిరుటితో పోల్చితే ఒక్కో కార్మికుడు రూ.42 వేలు నష్టపోతుండటం గమనార్హం. నిరుడు రూ.819 కోట్లు బోనస్‌గా చెల్లించగా, ఈ ఏడాది ప్రభుత్వం రూ.596 కోట్లే ప్రకటించింది. అంటే రూ. 223 కోట్ల బోనస్ తగ్గింది. సింగరేణి కార్మికులపై వివక్ష, హామీల అమలు పై నిర్లక్ష్యం, ప్రభుత్వం విస్మరిస్తున్న తీరుపై బీఆర్ఎస్ సమరభేరికి సిద్ధమైంది. ఈ నెల 14న తలపెట్టే 'కార్మిక గర్జన' సభకు కేటీఆర్ హాజరవుతున్నట్టు తెలియడంతో సర్కార్ హడలెత్తిపోయినట్టు చర్చ నడుస్తున్నది. దాదాపు మూడు నెలల నుంచి లాభాలు ప్రకటించి వాటా చెల్లించాలని కార్మికులు కోరుతున్నా.. పట్టించుకోని సర్కార్ మంగళవారం హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టి హడావుడిగా వాటా ప్రకటించింది. ఏటా పెంచుకుంటూ పోయే లాభాల వాటాను ఈ సారి ఎలాంటి మార్పు లేకుండా 34శాతానికే పరిమితం చేయడంపై కార్మికుల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. అనేక విషయాల్లో భట్టి స్పష్టత ఇవ్వలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వాస్తవ లాభాలు చెప్పకుండా కేవలం సంస్థ రూ.1,754 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్టు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వాస్తవ లాభాలు రూ.6,394 కోట్లుగా ప్రకటించి, భవిష్యత్తు అవసరాల కోసం రూ.4,034 కోట్లు పక్కనపెట్టి, రూ.2,360 కోట్ల నికర లాభాన్ని ప్రకటించారు. అందులో 34శాతం వాటాను కార్మికులకు చెల్లిస్తున్నట్టు నాడు భట్టి ప్రకటించారు. ఈసారి మాత్రం సింగరేణి వాస్తవ లాభా లు ఎంత? దాని నుంచి భవిష్యత్తు అవసరాలకు ఎంత పక్కన పెట్టారు? అనే విషయాల ను పేర్కొనకుండా కేవలం నికర లాభం మాత్రమే ప్రకటించడం చర్చకు దారితీసింది. 2023-24లో సంస్థ రూ.4,701 కోట్ల వా స్తవ లాభాన్ని సాధిస్తే, భవిష్యత్తు అవసరాల కోసం రూ.2,289 కోట్లను పక్కనపెట్టి రూ.2,412 కోట్ల నికర లాభమని పేర్కొం టూ 33 శాతం వాటా చెల్లించారు. 2023- 24లో లాభాల వాటాగా రూ.796 కోట్లు పంచితే 2024-25లో రూ.802 కోట్ల లాభాలను పంచారు. ఈసారి మాత్రం ప్రకటించిన నికర లాభం రూ.1,754 కోట్లపై 34 శాతంగా కార్మికులకు రూ.596.36 కోట్లు మాత్రమే వస్తున్నాయి. గడిచిన మూడేండ్లలో ఇదే అతి తక్కువ లాభాల వాటాగా ఉన్నది. సంస్థలో మెడికల్ బోర్డుల స్థానంలో మార్పు లు తెచ్చి, స్థానికంగానే సింగరేణి ఏరియా ద వాఖానల్లో నిర్వహిస్తామని ఉప ముఖ్యమం త్రి భట్టి విక్రమార్క పేర్కొనడం కార్మికులను అయోమయానికి గురిచేస్తున్నది. ఒకే చోట కాకుండా వివిధ ప్రాంతాల్లో బోర్డులు నిర్వహిస్తే, అందు లో ఎలాంటి చర్యలు తీసుకుంటారు? మెడికల్ అన్‌ఫిట్లు ఎలా అనేదానిపై స్పష్టత లేదు. కాంగ్రెస్ కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేల ఒత్తిడి మేరకు స్థానికంగానే మెడికల్ బోర్డు నిర్వహించి పైరవీలకు అవకాశం కల్పించడానికి ఈ నిర్ణయం తీసుకున్నారని విమర్శలు వస్తున్నాయి. కొద్ది నెలలుగా మెడికల్ బోర్డుల్లో 10-12 శాతం వరకే అన్‌ఫిట్లు చేయడంపై ఆరోపణలు వచ్చా యి.

## ఆ 2,006 ఎకరాలపైనా విచారించండి

- రేవంత్ కుటుంబం, మంత్రులు, కాంగ్రెస్ నేతల భూములపైనా విచారణ జరుపాలి
- ఆ భూములను జీవో-134 పరిధిలోకి తేవాలి
- ఆర్టికల్14కు విరుద్ధంగా దేవసేన కమిటీ
- స్పందించకుంటే హైకోర్టును ఆశ్రయిస్తాం
- బీఆర్ఎస్ నేతల భూములపైనే విచారణా?
- ఆర్ఎస్ ప్రవీణ్



**హైదరాబాద్, అక్టోబర్ 13:** సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులు, మంత్రులు, కాంగ్రెస్ నాయకులు, వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన 25 మంది వ్యక్తుల పేర్లతో ఉన్న 2006 ఎకరాల భూములపైనా జీవో-134 పరిధిలోకి తీసుకొచ్చి విచారణ జరుపాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాల్లో ఉన్న కాంగ్రెస్ నాయకుల భూముల వివరాలను పరిశీలించాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజుకు ప్రవీణ్‌కుమార్ లేఖ రాశారు. హైదరాబాద్ తెలంగాణభవన్‌లో మంగళవారం ఆయన మీడియా సమావేశంలోనే ఆ లేఖపై సంతకం చేశారు. ఆ 2006 ఎకరాల భూముల వివరాలను సర్వేనంబర్లతో సహా ఆయన మీడియాకు వెల్లడించారు. తన డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 ప్రకారం హైకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

రాష్ట్రంలోని 13 జిల్లాల్లో ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతల భూములే లక్ష్యంగా, వారి భూముల వ్యవహారాలపై విచారణ జరిపేందుకు సెప్టెంబర్ 24న జీవో 134ను సీఎస్ జారీ చేశారని చెప్పారు. సీనియర్ ఐఏఎస్ అధికారి దేవసేన చైర్మన్‌గా ఉన్న కమిటీకి ఈ బాధ్యతలు అప్పగిం చారని, అయితే, విచారణ పరిధిలోకి తీసుకున్న భూముల ఎంపికలో కక్షసాధింపు చర్యలు ఉన్నా యని విమర్శించారు. విచారణ ప్రక్రియపై సందేహా లు తలెత్తకుండా స్వతంత్ర, నిష్పక్షపాత విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. దేవసేన కమిటీ అన్ని రాజకీయ పార్టీల నాయకులు, వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన భూములను ఒకే ప్రమాణాలతో పరిశీలించాలని డిమాండ్ చేశారు.

## కరువుపై కాంగ్రెస్ సర్కార్ చోద్యం

- ఎల్ నినో హెచ్చరికలను పట్టించుకోని ప్రభుత్వం
- కరువు ముప్పు.. వ్యవసాయం నుంచి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వరకు ప్రభావం
- గోదావరి జలాల వినియోగంపై ఎందుకీ నిర్లక్ష్యం?
- నిపుణుల సూచనలు బేఖాతరు.. విలువైన సమయం వృథా
- ఇప్పటికైనా మేల్కొనాలి.. కరువు నివారణకు కార్యాచరణ అవసరం

**హైదరాబాద్, అక్టోబర్ 13:** ఎల్ నినో అంటే కేవలం వాతావరణ పరిణామం కాదు, అది వ్యవసాయం, నీటి భద్రత, ఆహార భద్రత, ప్రజల జీవనంపై ప్రభావం చూపే సవాల్. కానీ ప్రభుత్వం ఎల్ నినో హెచ్చరికకలను లెక్క చేయకుండా సంక్షోభం వచ్చే వరకు కాలయాపన చేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పునరుద్ధరణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన సమయంలో విలువైన సమయం వృథా చేసింది. సాగు, తాగునీటి భద్రతపై చర్యలు చేపట్టలేదు. వాతావరణశాఖ అంచనాల ప్రకారం ఎల్ నినో గతంలో నమోదైన అత్యధిక స్థాయిని మించే అవకాశం ఉన్నది. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరమున్నది. లేకపోతే సాగు ఆగమై, ప్రజల జీవనం దుర్భరంగా మారుతుంది.కరువు ఒక రంగానికి సంబంధించిన సమస్య కాదు. సాగునీరు, వ్యవసాయం, విద్యుత్తు, తాగునీరు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అన్నింటినీ ప్రభావితం చేసే గొలుసు ప్రభావం. ఈ ప్రమాదం రానున్నదని రాష్ట్ర ప్రభుత్వానికి కూడా తెలుసు. కరువును ఎదుర్కొనేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. అసలు ప్రశ్న ప్రభుత్వం హెచ్చరికను గుర్తించిందా లేదా అనేదే ముఖ్యం కాదు, ఆ హెచ్చరికకు తగిన వేగంతో చర్యలు తీసుకుంటున్నదా అనే ముఖ్యం. తెలంగాణకు ఆధారమైన అతిపెద్ద సహజ వనరు గోదావరి. ముఖ్యంగా ప్రాణహితగోదావరి సంగమం తర్వాత కన్నెపల్లి ప్రాంతంలో అందుబాటులోకి వచ్చే నీటిని సురక్షితంగా వినియోగించుకునే అవకాశాలను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించాలి. కానీ ఈ విషయంలో ప్రభుత్వం విలువైన సమయాన్ని కోల్పోయింది. గోదావరిలో లభిస్తున్న నీటిని సాధ్యమైన మేరకు వినియోగించుకోవాలని, కన్నెపల్లి పంప్ హౌస్‌తోపాటు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వ్యవస్థలో సురక్షితంగా ఉపయోగించగల భాగాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని వానకాలం ప్రారంభంలోనే రిటైర్డ్ ఇంజినీర్లు, నీటిపారుదల నిపుణులు సూచించారు.

కానీ ప్రభుత్వం పెడచెవినపెట్టింది. మరోవైపు కండ్లముందుగా ప్రవహిస్తున్న గోదావరి నీటిని సురక్షితంగా వినియోగించుకునే అవకాశాలను కోల్పోవడం పరిపాలనా దూరదృష్టి లోపంగానే కనిపిస్తున్నది.

## గ్రీవెన్స్ ఫిర్యాదులకు మోక్షమేదీ!..

- అవస్థలు పడుతున్న వినియోగదారులు
- రోజులు గడుస్తున్నా పరిష్కారం శూన్యం.. జలమండలిపై వెల్లువెత్తుతున్న విమర్శలు

**హైదరాబాద్, అక్టోబర్ 13:** గ్రీవెన్స్ సెల్‌లో ఉన్న సాఫ్ట్‌వేర్ సిస్టంలో లోపాలు వినియోగదారుల పాలిట శాపంగా మారుతున్నది. సాంకేతికంగా తలెత్తుతున్న ఇబ్బందుల వల్ల ఫిర్యాదులు నమోదు చేసుకోవడం పరిష్కరించేందుకు క్షేత్రస్థాయికి బదిలీ చేయడంలో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఏ సమస్యపై ఫిర్యాదు చేసినా ఒకే రకమైన సమాధానం వస్తుండటంతో తలలు పట్టుకుంటు న్నారు. నాలుగు రోజుల్లో సమస్య పరిష్కారానికి మార్గం చూపుతామంటూ మెసేజులు వెళ్తున్నాయి. కానీ వారం రోజు లు దాటుతున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జలమండలిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నాళ్లు ఎదురు చూ సినా సమస్యలు పరిష్కారం కాకపో వడంతో వినియోగదారులు మళ్లీ మళ్లీ ఫిర్యాదులు చేస్తున్నారు. గ్రీవెన్స్ సెల్‌కు వినియోగదారులు చేసిన ఫిర్యాదులు జలమండలి వ్యాప్తంగా ఎక్కడా పరిష్కారానికి నోచుకోవడం లేదు. కలుషిత నీటి సరఫరా, మ్యాన్ హోల్ సమస్యలు, సీవరేజీ కంప్లయింట్స్, నీటి సరఫరాలో తగ్గుదల, లో ప్రెషర్ వంటి సమస్యలపై జలమండలి గ్రీవెన్స్ సెల్‌కు వందల కొద్ది ఫిర్యాదులు అందుతున్నాయి. కానీ అందులో పది శాతానికి మించి పరిష్కారం కావడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. గ్రీవెన్స్ సెల్‌కు అందిన ఫిర్యాదులను అక్కడి సిబ్బంది క్షేత్రస్థాయిలోని మేనేజర్లకు చేరవేస్తున్నారు. కానీ అక్కడ మాత్రం ఎలాంటి పురోగతి ఉండటం లేదు. సమస్య ఉత్పన్నమయిన ప్రాంతానికి చెందిన మేనేజర్లు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తెలుస్తున్నది. అదేవిధంగా గణేశ్ నవరాత్రులు, దేవీ నవరాత్రులను సాకుగా చూపుతూ సమస్యల పరిష్కారంతో సమస్యలు తీర్చడంలో అలసత్వం వహిస్తున్నారు. ఏ చిన్న సమస్యపైన ఫిర్యాదు చేసినా ఏమాత్రం పట్టించుకోవడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. సీజన్‌తో సంబంధం లేకుండా కలుషిత నీరు సరఫరా అవుతున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి క్షేత్రస్థాయి సిబ్బంది వినియోగదారుల సమస్యలపై స్పందించాలని కోరుతున్నారు. ఇప్పటికే తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో క్షేతస్థాయిలో ఏ సమస్యా పరిష్కారం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బండ్లగూడ మండలంలోని ఛత్రినాక ప్రాంతానికి చెందిన ఓ వినియోగదారుడు తాగునీరు రంగుమారి దుర్వాసనతో సరఫరా అవుతున్నాయని ఈనెల 5న గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. సమస్యను అక్కడి జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. మరో 4 నాలుగు రోజుల్లో పరిష్కారం అవుతుందని మెసేజ్ వచ్చింది. కానీ పది రోజులు అవుతున్నా సమస్య పరిష్కారం కాలేదు. జలమండలి సరఫరాలో ఇంకా మురుగు, దుర్వాసనతో కూడిన నీళ్లు సరఫరా అవుతున్నది. దిక్కుతోచని స్థితిలో సంబంధిత జలమండలి అధికారులను సంప్రదించారు. దేవీ నవరాత్రులు కొనసాగుతున్నందున సమస్యను పరిష్కరించలేమని సెలవిచ్చారు. నవరాత్రులు ముగిసేదాకా ఏ పని చేయలేని తేల్చి చెప్పారు. అప్పటి దాకా మురుగు నీరు ఎలా తాగాలని ఆ వినియోగదారుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## 30వ అంతస్తు నుంచి పడి టెక్కీ మృతి

**హైదరాబాద్, అక్టోబర్ 13:** నానక్‌రాంగూడలోని గోల్ఫ్ ఎడ్జ్ అపార్టుమెంట్‌లోని 30వ అంతస్తు నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పడి దుర్మణం చెందాడు. రెండు రోజుల కిందటే ఈ అపార్ట్‌మెంట్‌లో ఓ ఫ్లాట్‌ను అద్దెకు తీసుకున్న ఉప్పల భరత్(29) సూర్యాపేట జిల్లా వాసిగా గచ్చిబౌలి పోలీసులు గుర్తించారు. బెంగుళూరులోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌కు వచ్చినట్లుగా గుర్తించారు. ఈ ఘటనకు రెండు రోజుల ముందే అతడు కొత్త ఫ్లాట్‌లోకి మారడం గమనార్హం. సోమవారం జరిగిన ఈ ఘటనలో భరత్ కింద ఉన్న పార్కింగ్ ఏరియాలోని వాహనంపై పడి తీవ్ర గాయాలు కాగా స్థానికులు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లుగా వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి బంధువు ఉప్పల కిషోర్ ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

# పండుగల వేళ కేంద్రం ఊరట- ఛార్జీల మోతపై తాజా నిర్ణయం..!




**న్యూఢిల్లీ, అక్టోబర్ 13:** దసరా, దీపావళి పండుగల సీజన్ లో యూపీఐ ఛార్జీల మోతను భరించేదెలా అని ఆందోళన చెందుతున్న యూజర్లకు కేంద్రం ఇవాళ గుడ్ న్యూస్ చెప్పింది. ఈ నెల 15 నుంచి అమలు చేయాలని భావించిన యూపీఐ ఛార్జీలను (UPI Charges) వాయిదా వేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. పండుగ సీజన్ లో 2 వేలకు మించిన యూపీఐ లావాదేవీలపై ఛార్జీల మోత మొదలుపెడితే వ్యాపారాలు గగ్గోలు పెడతారన్న ఆందోళనలు ఓవైపు, కస్టమర్లపై పడే ప్రభావం ఇంకోవైపు కేంద్రాన్ని ఈ నిర్ణయం తీసుకునేలా పురికొల్పాయి. పండుగ సీజన్‌లో ఇబ్బందుల్ని నివారించడానికి యూపీఐ ఛార్జీల అమలును వాయిదా వేయవచ్చని ఇప్పటికే నివేదికలు వచ్చాయి. వాటిని నిజం చేస్తూ.. ఎంపిక చేసిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ అమలును దీపావళి తర్వాత వరకు వాయిదా వేసినట్లు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (NPCI) తెలిపింది. ఎంపిక చేసిన వ్యక్తి-నుండి-వ్యాపారి (పి2వి) లావాదేవీలపై ఎండీఆర్ ను దీపావళి తర్వాత వెంటనే అమలు చేయాలని యూపీఐ సేవల స్టీరింగ్ కమిటీ నిర్ణయించింది. ఏ రోజు నుంచి ఈ ఛార్జీలు అమల్లోకి వస్తాయన్నది త్వరలో ప్రకటిస్తారు. అంతకు ముందు అక్టోబర్ 15 నుండి అమల్లోకి రావాల్సి ఉన్న యూపీఐ ఛార్జీలను వాయిదా వేయాలని వ్యాపార సంఘాలు, ఫిన్‌టెక్ సంస్థలు, చెల్లింపుల కంపెనీలు కేంద్రాన్ని కోరాయి. ఈ అభ్యర్థనలపై ప్రభుత్వం పరిశీలిస్తోందన్న వార్తల నేపథ్యంలో ఈ నిర్ణయం వెలువడింది. పండుగ షాపింగ్ సీజన్‌లో వ్యాపారులు, వినియోగదారులపై పడే ప్రభావంపై ఆందోళనల నేపథ్యంలో, ఈ అమలును జనవరి 2027 వరకు వాయిదా వేయాలని ఎన్పీసీఐ భావిస్తోందని కూడా గతంలో కథనాలు వచ్చాయి. కానీ అంతవరకూ అంటే కష్టమని భావించిన ఎన్పీసీఐ దీపావళి తర్వాతే అమలు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే యూపీఐ ఇంటర్ ఫేస్ నిర్వహణకు ఎలాంటి ఛార్జీలు వసూలు చేయకపోవడం భారంగా మారిందని కేంద్రం చెబుతోంది. యూజర్ల నుంచి ఈ ఛార్జీలు వసూలు చేసినా నష్టాల్ని పూరించుకునే పరిస్థితి లేదని, కేంద్రం అదనపు నిధులు అందించాలని ఎన్పీసీఐ కోరుతోంది.

## కేంద్ర బలగాలను ఈ నెల 20 వరకు ఉపసంహరించొద్దు.. హోంశాఖకు ఢిల్లీ పోలీసుల లేఖ



**న్యూఢిల్లీ, అక్టోబర్ 13:** ఆందోళనలు ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో కేంద్ర సాయుధ పోలీసు బలగాల లను ఇప్పుడే ఉనసంహరించవద్దని, కేంద్ర బలగాల మోహరింపును ఈ నెల 20 వరకు పొడిగించాలని ఢిల్లీ పోలీసులు కోరారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖకి లేఖ రాశారు. ఈ విష యాన్ని ఢిల్లీ ఉన్నతాధికారులు మంగళవారం వెల్లడించారు. ఆందోళనలు పెరిగే అవకాశం ఉందనే నిఘావర్గాల సమాచారం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. శాంతిభద్రతలను కాపాడటంతోపాటు ఉద్రిక్తతలకు తావులేకుండా ఉండేందుకే గడువు పెంచాలని కోరినట్లు చెప్పారు. కాగా ప్రస్తుతం విధుల్లో ఉన్న 273 కంపెనీల బలగాల మోహరింపు గడువు సోమవారంతో ముగిసింది. మరోవైపు జంతర్‌మంతర్, ఎన్నికల సంఘం కార్యాలయం, పార్లమెంట్ హౌస్, ఇండియా గేట్ వంటి ప్రాంతాల్లో నిరసనలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. ఈ 273 సీఏపీఎఫ్ కంపెనీల మోహరింపును పొడిగించాలని పోలీసులు తమ లేఖలో పేర్కొన్నారు. నిరసనల నేపథ్యంలో ఢిల్లీలో మొత్తం 301 కంపెనీల సీఏపీఎఫ్ బలగాలకు అనుమతి లభించింది. అక్టోబర్ 6న 221 కంపెనీలకు, 8న మరో 80 కంపెనీలకు ఆమోదం తెలపడంతో ఆ కంపెనీలు విధుల్లో పాల్గొన్నాయి. అదనంగా మంజూరైన 80 బలగాల్లో 28 సోమవారం నాటికి ఢిల్లీకి చేరుకోలేదు.

# హైదరాబాద్‌కు కేంద్రం గుడ్ న్యూస్

- **డబుల్ డెక్కర్ కారిడార్‌కు ఆమోదం..!!**





**హైదరాబాద్, అక్టోబర్ 13:** హైదరాబాద్ కు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. ఢిల్లీలో కేంద్రమంత్రి గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భేటీ అయ్యారు. తెలంగాణలో కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులపై భేటీలో కీలక అంశాల పైన చర్చించారు. ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు కేంద్రం ఆమోదం తెలిపింది. కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన శంకుస్థాపన ప్రతిపాదనకు కేంద్రమంత్రి అంగీకారం తెలిపారు. తెలంగాణలో కీలక మౌలిక వసతులు.. ప్రాజెక్టుల పై కేంద్ర మంత్రి గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి సుదీర్ఘంగా చర్చించారు. నవంబర్ 19-22 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న 'ఇండియన్ రోడ్ కాంగ్రెస్' (IRC) సదస్సుకు హాజరు కావాలని కేంద్ర మంత్రి గారిని ఆహ్వానించగా, వారు తప్పక వస్తానని హామీ ఇచ్చారు. ఎల్బీనగర్ - హయత్ నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు ఆమోదం తెలిపిన గడ్కరీ మరి కొన్ని అంశాలకు అంగీకరించారు. ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణంతో చీఎ 167ఎపై తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్ వరకు అనుసంధానం జరిగితే, రవాణా వ్యవస్థ, పర్యాటకం మెరుగుపడ నుందని కోమటిరెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ - శ్రీశైలం చీఎ 765పై ఎలివేటెడ్ కారిడార్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేయడంపై నూతన డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులకు కేంద్రమంత్రి ఆదేశించారు. గడ్కరీతో కోమటిరెడ్డి చర్చల ఫలితం అదే విధంగా పర్వతమాల పథకం ద్వారా తెలంగాణకు 5 రోప్‌వేలకు నితిన్ గడ్కరీ ఆమోదం తెలిపారు. హైదరాబాద్ - అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవేపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. సేతు బంధన్ పథకం ద్వారా 3 ఆర్‌ఓబీలకు నితిన్ గడ్కరీ ఆమోదం తెలిపారు. తెలంగాణలో 34 పనులకు సీఆర్ఐఎఫ్ (CRIF) నిధులను మంజూరు చేయాలని కోమటిరెడ్డి కోరగా కేంద్ర అధికారులను నితిన్ గడ్కరీ ఆదేశించారు. పుల్లూరు - అలంపూర్ - జట్రపోలు - పెంట్లవెల్లి - కొల్లాపూర్ - లింగాల - అచ్చంపేట - డిండి - దేవరకొండ - మల్లేపల్లి - నల్గొండ రాష్ట్ర హైవేలను జాతీయ హైవేలుగా మార్చాలని కోమటిరెడ్డి కోరడంతో సానుకూలంగా కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు.

# టీజీఎస్ఆర్టీసీ మరో కొత్త సంచలన రికార్డ్..



## మూడు రోజుల్లోనే 1.4కోట్ల మంది ప్రయాణం!

**హైదరాబాద్, అక్టోబర్ 13:** టీజీఎస్ఆర్టీసీ దసరా పండుగ సందర్భంగా మరో కొత్త సంచలన రికార్డ్ నమోదు చేసింది. అక్టోబర్ నెలలో ఊహించని విధంగా మూడు రోజుల్లోనే నయా రికార్డ్ నమోదు చేసింది. టీజీఎస్ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి సోమవారం అధికారులతో జూమ్ సమీక్ష నిర్వహించి ఈ వివరాలను వెల్లడించారు. 9, 10, 11 తేదీల్లో మొత్తం మూడు రోజుల్లోనే 1.4 కోట్ల మంది ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణించారు. ఇది సంస్థ చరిత్రలోనే అత్యధిక సంఖ్య. ఇదే విషయాన్ని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి వెల్లడించారు. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం మహిళలకు పెద్ద ఉపశమనం కలిగిస్తోంది. ఈ దసరా సమయంలో మహిళలు రోజుకు సగటున రూ.13.73 కోట్ల మేర ఆదా చేసుకున్నారన్నారు. గతేడాది ఇదే కాలంలో రోజుకు రూ.13.02 కోట్లు ఆదా కాగా, ఈ సారి మరింత పెరిగిందని పేర్కొన్నారు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ తదితర సర్వీసుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారని స్పష్టం చేశారు. పండుగ రద్దీ మరింత పెరిగే అవకాశం ఉండటంతో అక్టోబర్ 15, 16, 17 తేదీల్లో కూడా అదనపు బస్సులు నడపాలని ఎండీ ఆదేశాలు ఇచ్చారు. తిరుగు ప్రయాణాలకు అక్టోబర్ 25, 26 తేదీల్లోనూ ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేస్తారు. మొత్తంగా దసరా సీజన్‌లో సుమారు 7,000 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. గత ఏడాది దసరా తొలి మూడు రోజుల్లో 922 అదనపు బస్సులు నడిపితే, ఈ సారి 1,417 ప్రత్యేక బస్సులు అందుబాటులోకి తెచ్చారు. అంటే గతేడాదితో పోలిస్తే 495 బస్సులు అదనం. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సర్వీసులను నిరంతరం పర్యవేక్షించాలని ఎండీ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్‌తో పాటు కేపీహెచ్‌బీ కాలనీ, ఉప్పల్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, ఆరాంఘర్ వంటి ప్రాంతాల నుంచి రాష్ట్రం నలుమూలలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కనీసం 30 మంది ఒక బృందంగా బుక్ చేసుకుంటే వారి కాలనీ, హాస్టల్ లేదా గేటెడ్ కమ్యూనిటీ వద్దకే బస్సు వచ్చి పికప్ చేసుకునే సౌకర్యం కూడా కల్పించారు.

ప్రయాణికులు ముందస్తు రిజర్వేషన్ కోసం ఉఉఉ.స్ర్టంతీఎబం.అఅ వెబ్‌సైట్‌ను ఉపయోగించవచ్చు. అవసరమైతే 040-69440000, 040-23450033 నంబర్లలో కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చు. దసరా పండుగ సందర్భంగా ప్రజలు సురక్షితంగా, సౌకర్యవంతంగా స్వగ్రామాలకు చేరుకునేలా టీజీఎస్ఆర్టీసీ పూర్తి స్థాయిలో సిద్ధమైంది. ఇలా అన్ని వసతులు కల్పిస్తున్న కారణంగానే రికార్డ్ ప్రయాణాలు నమోదు అవుతున్నాయని ఆర్టీసీ ఎండీ స్పష్టం చేశారు.

# త్వరలోనే కరువు మండలాల ప్రకటన

## రబీలో ఆ పని చెయ్యొద్దు : రైతులకు అలెర్ట్!



**హైదరాబాద్, అక్టోబర్ 13:** తెలంగాణా రాష్ట్ర రైతాంగానికి రైతు నేస్తం కార్యక్రమం ద్వారా ప్రభుత్వం కీలక సూచనలు చేసింది. ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల రైతులతో రైతు వేదికల ద్వారా వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడిన మంత్రులు రైతులకు పలు కీలక సూచనలు చేశారు. ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా రబీ సీజన్‌లో రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వరి సాగు చేయవద్దని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. నేడు హైదరాబాద్‌లో రైతు నేస్తం కార్యక్ర మంలో భాగంగా ఆయన, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సహా అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల్లోని రైతులు, అధికారులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ సందర్భంగా తెలంగాణా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం వల్ల ఈ ఏడాది వర్షపాతం తగ్గి నీటి లభ్యత గణనీయంగా తగ్గుతుందని హెచ్చరించారు. కాబట్టి నీటిని పొదుపుగా వినియోగించాలని, బిందు సేద్యం ద్వారా పామ్ తోటలు, కూరగాయలు వంటి స్వల్పకాలిక పంటలను సాగు చేయాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తే మంచిదని సలహా ఇచ్చారు. వరి వంటి నీటి అవసరం ఎక్కువైన పంటలు సాగు చేస్తే తాగునీటి సమస్య తీవ్రమవుతుందన్నారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, బోర్వెల్స్ రీఛార్జ్‌వంటి పనులు చేపట్టి జలవనరులను కాపాడుకోవాలని కోరారు. రాష్ట్రంలో 315 మండలాల్లో వర్షపాతం తక్కువగా నమోదైందని, త్వరలోనే కరువు మండలాలను ప్రకటిస్తామని చెప్పారు. వచ్చే వర్షాకాలం నాటికి తాగునీటి సమస్యలు రాకుండా ఇప్పటి నుంచే నీటిని జాగ్రత్తగా వాడాలని సూచించారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాపై సరైన ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. భూగర్భజలశాఖ అధికారులు ఎప్పటికప్పుడు గ్రౌండ్ వాటర్ లెవెల్ నివేదికలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం రైతుల ప్రయోజనాలు, ప్రజాసంక్షేమం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. రైతులు ప్రభుత్వ సలహాలు పాటించి, నీటిని పొదుపుగా వినియోగిస్తే ఈ కష్టకాలం సులభంగా దాటవచ్చని ఆయన అన్నారు.

# నీటి సంక్షోభం.. నీరు వృథా చేస్తే నాగ్‌పూర్‌లో రూ.5,000 ఫైన్..

## పూనేలో వారానికోసారి నీళ్లు బంద్



**న్యూఢిల్లీ, అక్టోబర్ 13:** దేశంలో అత్యంత కరువు ఎదుర్కొనే రాష్ట్రాల్లో మహారాష్ట్ర ఒకటి. అక్కడ అనేక ప్రాంతాల్లో నీటి వనరులు చాలా తక్కువ. అందులోనూ ఈసారి ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా పడి, నీటి వనరులు తగ్గిపోయాయి. ఇదే సమయంలో పెద్ద పట్టణాలైన నాగ్‌పూర్, పూనేలను తీవ్ర నీటి కొరత వేధిస్తోంది. అందుకే, ఉన్న నీటి వనరుల్ని సక్రమంగా వాడుకునేలా, నీరు వృథా, దుర్వినియోగం కాకుండా చూసేలా కఠిన చర్యలకు అక్కడి పాలకవర్గం సిద్ధమైంది. దీనిలో భాగంగా నీటిని వృథా చేసేవారికి రూ.5,000 జరిమానా విధించాలని నాగ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్ (ఎన్‌ఎంసీ) ప్రతిపాదించింది. అంటే, ప్రతి ఒక్క నీటి వృథాకి రూ.5,000 చొప్పున ఫైన్ విధిస్తారు. అలాగే, మరో పెద్ద పట్టణమైన పూనేలో కూడా పాలకవర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై అక్టోబర్ 15 నుంచి వారానికోసారి నీటికి వీక్లీ కట్ ఇవ్వనుంది. అంటే, ప్రతి గురువారం నీటి సరఫరా ఉండదు. నాగ్‌పూర్‌కు సంబంధించి నీటి రేషనింగ్‌ను ఎన్‌ఎంసీ పరిశీలిస్తోంది. నగరంలో నీటి కొరతపై మేయర్ నీతా తకారే అధికారులతో సమీక్ష జరిపారు. నీటి లభ్యత, సరఫరా వంటి వివరాల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నీటిని సద్వినియోగం చేసుకునే చర్యలపై దృష్టిపెట్టారు. దీని ప్రకారం తాగునీటిని వాహనాలు శుభ్రం చేయడానికి వాడకూడదు. రోడ్లను కడగడం, అరుగుల మీద నీళ్లు చల్లడం వంటివి చేయకూడదు. గార్డెన్లలో నీటి వినియోగం, నిర్మాణం రంగంలో నీటి వినియోగంపైనా పరిమితులు విధించనున్నారు. నాగ్‌పూర్‌కు నీళ్లు అందించే రిజర్వాయర్‌లో ప్రస్తుతం 746 మిలియన్ క్యూబిక్ మీటర్ల నీళ్లున్నాయి. ఇది పూర్తి సామర్థ్యంలో 58 శాతం మాత్రమే. ఇటీవల వర్షాలు పడకపోవడం వల్ల ఈ పరిస్థితి తలెత్తింది. ందువల్ల ఉన్న తక్కువ నీటిని సరిగ్గా వాడుకోవాలని ఎన్‌ఎంసీ భావిస్తోంది. పూనే నగరం కూడా ఈ అంశంపై దృష్టిపెట్టి, నీటి కోతలకు సిద్ధమైంది. ప్రజలు నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని సూచించింది. వారంలో గురువారం రోజు నీటి సరఫరా ఆపివేయనుంది. అక్రమంగా నీటిని వాడుకుంటున్న వారిపై కొరడా ఝుళిపించనుంది. అయితే, వేసవి కూడా రాకముందే పరిస్థితి ఇలా ఉంటే.. వచ్చే వేసవిలో ఇంకెలాంటి కఠిన పరిస్థితులు చూడాల్సి వస్తుందో అని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

# ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలి..

**-ఎల్ నినో నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలు వేయాలి**

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

బలగం టీవీ,బోయినపల్లి:

దీర్ఘకాలిక ఆదాయం సమకూరే ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. బోయినపల్లి మండలం వరదవెల్లిలో తరిగొప్పుల మురళి అనే రైతు 4 ఎకరాల 20 గుంటల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించగా, జిల్లా కలెక్టర్ హాజరై మొక్కలు నాటారు. మొక్కలు నాటేందుకు వీ బీ జీ రామ్ జీ కింద కూలీలతో గుంతలు తవ్వించారు. అలాగే మొక్కలు నాటించారు. మూడు ఏండ్ల పాటు కూలీలు కలుపు మొక్కల నిర్మూలన, నీటిని పట్టి మొక్కలను సంరక్షించే పనులు చేయనున్నారని అధికారులు తెలిపారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అందజేశారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగుతో దీర్ఘ కాలం పాటు ఆదాయం సమకూరుతుందని వివరించారు. జిల్లాకు సరిహద్దులోని సిద్దిపేట జిల్లాలో నర్మెట్ట వద్ద ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ అందుబాటులోకి వచ్చిందని వెల్లడించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో దృష్ట్యా రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు పంటలు సాగు చేయాలని సూచించారు.

**పామ్ పాండ్ పనుల పరిశీలన..**

రత్నంపేట గ్రామపంచాయతీ పరిధిలో రైతు కౌటగాని పద్మ ఆయిల్ పామ్ తోటలో పామ్ పాండ్ నిర్మించుకుంటుండగా,



జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. ఎంత మంది కూలీలకు ఉపాధి దొరుకుతుందని, ఎంత విస్తీర్ణంలో నిర్మిస్తున్నారని ఆరా తీశారు?

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం జలసిరి కింద పామ్ పాండ్, ఇంకుడు గుంతలు, బోర్ వెల్ రీచార్జ్ నిర్మాణాలకు శ్రీకారం చుట్టిందని తెలిపారు.

రైతులు, గృహ నిర్మాణదారులు తప్పకుండా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. దీంతో వాన నీటిని సంరక్షించవచ్చుని, భూ గర్భ జలాలు వృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు, ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, తహసీల్దార్ షరీఫొద్దీన్, ఇంచార్జి ఎంపీడీఓ శ్రీధర్ తదితరులు ఉన్నారు.

# భూముల రీ సర్వే రైతుల సమక్షంలో చేయాలి



**- కలెకర్ గరిమ అగ్రవాల్***

బలగం టీవీ,బోయినపల్లి,

భూ భారతి కింద భూముల రీ సర్వే రైతుల సమక్షంలో చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. బోయినపల్లి మండలం వరదవెల్లిలో భూ భారతి కింద రోవర్ యంత్రంతో భూముల రీ సర్వే పనులు కొనసాగుతుండగా, మంగళవారం జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే యంత్రంతో వివరాలు ఎలా తీసుకుంటారో పరిశీలించారు.

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో భూ భారతి కింద భూముల రీ సర్వే పనులు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలో సర్వే పై రైతులకు ముందుగా జీపీ ఓ లు, పంచాయతీ కార్యదర్శులు సమాచారం అందించాలని సూచించారు. భూముల వివరాలను పూర్తి కచ్చితత్వంతో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఆయా ప్రభుత్వ శాఖల అధికారులకు సమాచారం అందించి.. భూముల రీ సర్వే చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షరీఫొద్దీన్, సర్వే శాఖ అధికారులు ఉన్నారు.

# గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి..

**-కొనరావుపేట పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ**

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

కొనరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, వైద్య సేవల నిర్వహణపై సమీక్ష నిర్వహించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.

గర్భిణులను 12 వారాల్లోపు నమోదు చేసి, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని, ప్రమాదకర గర్భధారణ కేసులను గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, చిన్నారులకు పూర్తిస్థాయిలో టీకాలు వేయించాలని సూచించారు.

అనంతరం నిమ్మపల్లి ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించి క్షేత్రస్థాయిలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నిరంతరం ఆరోగ్య సేవలు అందించాలని, ఆశా కార్యకర్తలు గ్రామస్థాయిలో ఆరోగ్య అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆరోగ్య పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా వైద్య సిబ్బంది సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు.ఈ తనిఖీలో వైద్యాధికారి డాక్టర్ సురేష్, ఎంపీహెచ్ఈఓ రామణాథం, సీహెచ్ఓ మోహన్, ఎంపీహెచ్ఎస్ రషీద్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



# విభిన్న పంటలు.. మంచి ఆదాయం



**వరి నుంచి ఉద్యానవన పంటల వైపు రైతు ముందుకు**

బలగం టీవీ,బోయినపల్లి:

సంప్రదాయ వరిసాగును వదిలి .. మూడున్నర ఎకరాల్లో ఆయిల్ పామ్ పంటలో అంతర పంటగా నాలుగు రకాల కూరగాయలు, పూల తోటలు సాగు చేస్తున్నారు. పంట మార్పిడితో నేల సారం పెరగగా, మేలైన దిగుబడి వస్తూ .. మంచి ఆదాయం సమకూరుతుంది. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ క్షేత్రస్థాయిలో పరిశీలించి.. రైతును అభినందించారు.

బోయినపల్లి మండలం వరదవెల్లి గ్రామంలో నీలోజుపల్లి గ్రామానికి చెందిన రైతు కడుదుల రాజు- అంజలి తమకు ఉన్న 8 ఎకరాల్లో వరి సాగు చేసేవారు. ఎల్ నినో ప్రభావం, వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు రాజు వరిని వదిలి దాదాపు 3.5 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తూ.. అంతర పంటలుగా బెండకాయ, టమాట, మిర్చి, కాలిఫ్లవర్, అలాగే బంతి, పట్టుకుచ్చులు, వేరు శెనగ వేశారు. తక్కువ నీటితో ఆయా కూరగాయలు పండిస్తూ.. మంచి దిగుబడి, ఆదాయం పొందుతున్నారు. బెండకాయ విత్తనాలు నాటిన తర్వాత రెండు నెలల నుంచి దిగుబడి మొదలై 45 రోజులు నుంచి 60 రోజుల వరకు పంట ఉత్పత్తి వస్తుందని, టమాట నాటిన రెండు నెలల తర్వాత దిగుబడి మొదలై 60 నుంచి 70 రోజుల పాటు పంట ఉత్పత్తి వస్తుందని, మిర్చి నాటిన రెండు నెలల తర్వాత దిగుబడి మొదలై దాదాపు నాలుగు నెలల పాటు పంట ఉత్పత్తి వస్తుందని, కాలీఫ్లవర్ నాటిన మూడు నెలల తర్వాత ఒకేసారి దిగుబడి చేతికి వస్తుందని రైతు రాజు చెప్పారు.

బతుకమ్మ, దసరా, దీపావళి నేపథ్యంలో బంతిపూలను సాగు చేస్తున్నారు. ఆయా పండుగలు నేపథ్యంలో అదనపు ఆదాయం వస్తుంది. బతుకమ్మ కోసం ప్రత్యేకంగా పట్టుకుచ్చులు సాగు చేశారు. అలాగే కొంత విస్తీర్ణంలో వేరు శెనగ సాగు చేస్తున్నారు.

**ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి**

రైతు రాజు -అంజలి సాగు చేస్తున్న ఆయా కూరగాయలు, పూల తోటలను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం పరిశీలించారు. కూరగాయలు దిగుబడి చూసి.. ఎన్ని రోజుల పాటు ఉత్పత్తి వస్తుందని? ఆదాయం ఎంత వస్తుందో? ఆరా తీశారు. తాను వరి సాగు చేసినప్పుడు ఎకరానికి రూ. 50 వేల ఆదాయం వచ్చేదని, ఇప్పుడు కూరగాయల సాగుతో ఎకరానికి దాదాపు రూ. లక్ష వరకు ఆదాయం వస్తుందని రైతు తెలిపారు. ఆ రైతు దంపతులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అభినందించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసాయని, భూగర్భ జలాలు తగ్గుతున్నాయని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని పిలుపు నిచ్చారు. వరికి బదులుగా కూరగాయలు, కందులు, పెసర్లు, మినుములు, మొక్కజొన్న, ఆముదం, నువ్వులు, వేరు శెనగ, శెనిగెలు, పొద్దు తిరుగుడు, ఆయిల్ పామ్ సాగు కోరారు. ఉద్యానవన పంటల సాగు కోసం డ్రిప్ ఇరిగేషన్ వాడాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో అధికారుల సూచనల మేరకు పంటలు సాగు చేయాలని సూచించారు. యాసంగి లో రైతు రాజు మొత్తం విస్తీర్ణంలో కూరగాయలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపు నిచ్చారు.ఈ పరిశీలనలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, తహసీల్దార్ షరీఫొద్దీన్, ఇంచార్జి ఎంపీడీఓ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



# బొప్పాపూర్ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం నియామకం

**బొప్పాపూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా మేడిపల్లి దేవానందం**

**వైస్ ఛైర్మన్‌గా నంది కిషన్ నియామకం**

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా కోరుట్లపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాజీ సర్పంచ్ మేడిపల్లి దేవానందం, వైస్ ఛైర్మన్‌గా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన నంది కిషన్ నియమితులయ్యారు.

తమపై నమ్మకంతో కీలక పదవులు కేటాయించిన కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి నూతన ఛైర్మన్ మేడిపల్లి దేవానందం, వైస్ ఛైర్మన్ నంది కిషన్ కృతజ్ఞతలు తెలిపారు. తమకు ఈ అవకాశం కల్పించడంలో సహకరించిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మార్కెట్ కమిటీ పరిధిలోని రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. బొప్పాపూర్ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు, కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ రైతుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని వారు స్పష్టం చేశారు







# అనంతారం గ్రామంలో హెచ్చరిక బోర్డు

**ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు**

బలగం, టీవీ ఇల్లంతకుంట

ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామంలో సర్వే నెంబర్ 119/ఇ, 122/ఆ గల భూమిలో రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్డీఓ ఆదేశానుశారం మండల రెవెన్యూ అధికారులు అట్టి భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో వొల్లాల నర్సయ్య, అనునతనికి అతని అన్న కు సంబందించిన భూముల మధ్య వివాదం నడుస్తున్న సందర్భంగా ఎలాంటి గొడవలు జరుగకుండా ఉండుట కోసం ఆర్డీఓ ఆదేశానుశారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం లో ఆర్ ఐ సంతోష్, గ్రామ జిపిఓ రాజు, వొళ్ళాల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు



# సిరిసిల్ల మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

**అధ్యక్షుడిగా బి. ఎలీషా, ప్రధాన కార్యదర్శిగా బి. సామ్యూల్**

**చంద్రంపేటలోని హెర్మన్ గాస్పల్ చర్చిలో ఘనంగా కార్యక్రమం**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల

రాజన్న సిరిసిల్ల మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, మంగళవారం చంద్రంపేటలోని హెర్మన్ గాస్పల్ చర్చిలో నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన అధ్యక్షుడిగా బి. ఎలీషా, ప్రధాన కార్యదర్శిగా బి. సామ్యూల్, ఉపాధ్యక్షుడిగా మేకల అరుణ్ కుమార్, కార్యదర్శిగా కడారి శేఖర్, కోశాధికారిగా వడ్డేపల్లి ఇస్సాక్ ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా బిట్ల మోజెస్, లకావత్ ఏసుదాస్ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరీంనగర్‌కు చెందిన ప్రసంగికుడు తిమోతి, జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు జీవన్ ఇండియా, ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాజేష్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ క్రైస్తవ సంఘాల మధ్య ఐక్యతను పెంపొందిస్తూ, పరస్పర సహకారంతో దేవుని సేవలో ముందుకు సాగాలని పాస్టర్లకు సూచించారు. ప్రతి క్రైస్తవుడు సంఘాల ఐక్యతకు కృషి చేయడంతో పాటు, ఏసుక్రీస్తు రెండవ రాకడను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరినీ ఆత్మీయంగా సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. దేవుని వాక్య బోధన, ప్రార్థన, సువార్త సేవ ద్వారా విశ్వాసులను బలపరుస్తూ క్రైస్తవ సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు సూర దేవరాజు హాజరై క్రైస్తవులకు అండగా ఉంటామని తెలియజేశారు, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కార్యవర్గ సభ్యులు మండలంలోని పాస్టర్లందరినీ సమన్వయం చేసుకుంటూ, సంఘాల ఐక్యతకు మరియు ఆత్మీయ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం క్రైస్తవ ఐక్యత, ఆత్మీయ సేవా భావాన్ని చాటిచెప్పింది. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు దేవయ్య, ప్రభు దాస్, నతనీయేల్, ప్రసాద్, విద్యానందం, ప్రాన్సిస్, ప్రేమ్ కుమార్, జిల్లా మీడియా కన్వీనర్ కులేరి కిషోర్ కుమార్ సుమారు రెండు వందల మంది పాల్గొన్నారు ,



# బాధితులకు సత్వర న్యాయం అందించాలి..

**- గ్రామీణ ప్రాంత ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి..**

**- డయల్ 112 కాల్స్‌పై తక్షణమే స్పందించాలి..**

**- ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పోలీస్ స్టేషన్ల పనితీరును మరింత మెరుగుపరిచే దిశగా మంగళవారం రోజున ముస్తాబద్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా కేసుల పురోగతి, పెండింగ్ దర్యాప్తులు, స్టేషన్ రికార్డులు, సిబ్బంది హాజరు, రౌడీషీటర్లు మరియు నేరస్తులపై నిఘా అంశాలను సమీక్షించి, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ.. వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్ కి వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందేలా బాధ్యతగా మెలగాలని సూచించారు.పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని,విధినిర్వహణలో అలసత్వం వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆదేశించారు.

పోలీస్ స్టేషన్లో వర్టికల్స్ వారీగా విధులు నిర్వర్తించే సిబ్బందిని ఒక్కొక్కరిగా వారి పనితీరు గురించి పరిశీలించారు.ఆధునిక సాంకేతిక వ్యవస్థపై అధికారులు సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని, స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి,ఆన్‌లైన్ మోసాలు, నకిలీ లింకులు, ఓటీపీ మోసాలు, డిజిటల్ అరెస్టుల వంటి సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తూ అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని,గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో. పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని,డయల్ 112 కు కాల్ రాగానే పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ సిబ్బంది తక్షణమే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు అండగా నిలవాలని సూచించారు. పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు,సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఎస్పీ వెంట డిఎస్పీ నాగేంద్రచారి, సిఐ నాగేశ్వరరావు ఎస్.ఐ జ్యోతి, సిబ్బంది ఉన్నారు.





# కాంగోలో తీవ్రమవుతున్న ఎబోలా

**9 వేలకు పైగా నిర్ధారణ కేసులు!**
బలగం టీవీ, బునియా

ఆఫ్రికా దేశమైన కాంగోలో ఎబోలా వైరస్ నియంత్రణ ప్రయత్నాలు విఫలమవుతుండటంతో వ్యాప్తి మరింత తీవ్రరూపం దాల్చింది. మంగళవారం విడుదల చేసిన ఆరోగ్య శాఖ డేటా ప్రకారం, దేశంలో కన్ఫర్మ్ అయిన ఎబోలా కేసుల సంఖ్య 9,000 మార్కును దాటింది.

తాజా నివేదిక ప్రకారం, మొత్తం 9,066 నిర్ధారిత కేసులు నమోదు కాగా, వైరస్ బారిన పడి 4,381 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇది నమోదైన మొత్తం కేసులలో దాదాపు సగానికి సమానమైన మరణాల రేటు కావడం గమనార్హం. పెరుగుతున్న ఈ మరణాల సంఖ్య ఆరోగ్య కార్యకర్తలను, అధికారులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తుండగా.. రికార్డైన మరణాలలో అధిక శాతం మంది చికిత్స కేంద్రాల వెలుపలే ప్రాణాలు కోల్పోతున్నట్లు అధికారులు వెల్లడించారు



# లడఖ్‌లోని 28 కీలక ప్రాంతాలకు ప్రామాణిక పేర్లు నిర్ణయించిన భారత్..

**చైనా వ్యర్థ ప్రలాపాలు!**
బలగం టీవీ, న్యూఢిల్లీ

కేంద్రపాలిత ప్రాంతమైన లడఖ్‌లోని 28 వ్యూహాత్మక ప్రాంతాలు, భౌగోళిక ప్రాంతాల పేర్లను అధికారిక మ్యాపింగ్ కోసం భారతదేశం ప్రామాణీకరించింది (Standardised names). సర్వే ఆఫ్ ఇండియా (SoI) అధికారిక మ్యాప్‌లో చేర్చడం కోసం శిఖరాలు, పాస్‌లు, ల్యాండ్ ఏరియాలు మరియు జల వనరులకు వాటి ప్రామాణిక పేర్లను నిర్ధారించారు. ప్రజల్లో స్పష్టమైన అవగాహన, గుర్తింపు కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

చైనా అభ్యంతరం - భారత్ గట్టి సమాధానం

భారత్ తీసుకున్న ఈ నిర్ణయంపై చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ స్పందిస్తూ, లడఖ్ ప్రాంతాన్ని తాము గుర్తించమని, భారత్ పేర్లను ప్రామాణీకరించడం చెల్లదంటూ వ్యాఖ్యానించారు. అయితే, భారత్ తన భూభాగ సార్వభౌమాధికారంపై ఏమాత్రం తగ్గేదేలేదని స్పష్టం చేసింది. జమ్మూ కాశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలు భారతదేశంలో విడదీయరాని అంతర్భాగాలని, చైనా చేసే ఎలాంటి రాజకీయ ప్రచారాలు ఈ వాస్తవాన్ని మార్చలేవని భారత్ పునరుద్ఘాటించింది.

ప్రామాణీకరించిన 28 ప్రాంతాల వివరాలు:

శిఖరాలు, పర్వతాలు: అతీశా గిరి, కనిష్క పీక్, కరుణ్ పీర్, మార్తాండ్ గిరి, డ్రాక్ కార్పో, జోల్మోరి, రించెన్ జంగ్పో, శాక్యశ్రీ గిరి, మార్పా లోత్సవా రీ, మిలరేపా కాంగ్రి, శివ రీ, జోరావర్ పీక్, మహేశ్వర రీ.

పాస్‌లు, హిమానీనదాలు: చప్‌చింగల్ పాస్, షాచ్‌మిర్క్ పాస్, పర్వేక్ గ్లేసియర్, స్క్రామీ గ్లేసియర్.

భూభాగాలు: బ్రాంగ్సా ల్యాండ్, కుక్సెల్, దేప్రా కాంపాస్, గోగ్రా, కుమారాయణ పాయింట్, పంగ్లంగ్, షమాల్ లుంగ్పా.

లోయలు, జలవనరులు: శ్కోర్గా వ్యాలీ, గురు రిన్‌పోచే సరస్సు, యాంగ్పా నది, హాట్ స్ప్రింగ్.

## పాకిస్థాన్‌లో రైలు ప్రమాదం

**ఆరుగురు మృతి.. 30 మందికి గాయాలు**
బలగం టీవీ, న్యూఢిల్లీ

పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో మంగళవారం ఉదయం ఘోర రైలు ప్రమాదం జరిగింది. కరాచీ నుంచి పెషావర్ వెళ్తున్న రెహమాన్ బాబా ఎక్స్‌ప్రెస్ ముల్తాన్‌లోని షేర్ షా వంతెన సమీపంలో పట్టాలు తప్పింది. ఈ ఘటనలో ఆరుగురు మృతిచెందగా, మరో 30 మంది గాయపడ్డారు.

రైలులోని 14 బోగీలు పట్టాలు తప్పినట్లు అధికారులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించగా, క్షతగాత్రులు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ప్రమాదం కారణంగా ఆ మార్గంలో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. రైలు సర్వీసులను పునరుద్ధరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.



# ఫాక్‌లాండ్స్ చమురు ప్రాజెక్టుపై బ్రిటన్, అర్జెంటీనా మధ్య తీవ్ర ఉద్రిక్తత

**అంతరాతీయ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించిన అర్జెంటీనా!**
బలగం టీవీ, బ్యూనస్ ఎయిర్స్ (అర్జెంటీనా)

వివాదాస్పద ఫాక్‌లాండ్ దీవుల సమీపంలో బ్రిటన్ చేపట్టాలని భావిస్తున్న తొలి వాణిజ్య చమురు ప్రాజెక్టు అభివృద్ధిని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ అర్జెంటీనా అంతర్జాతీయ సముద్ర చట్టాల ట్రైబ్యునల్‌ను ఆశ్రయించింది. దీంతో ఫాక్‌లాండ్స్ సార్వభౌమాధికారం, సహజ వనరుల వినియోగంపై బ్రిటన్, అర్జెంటీనాల మధ్య దశాబ్దాలుగా నడుస్తున్న వివాదం మరోసారి తీవ్ర రూపం దాల్చింది.

అంతర్జాతీయ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించిన మిలే ప్రభుత్వం

జెర్మనీలోని హంబర్గ్‌లో ఉన్న 'ఇంటర్నేషనల్ ట్రైబ్యునల్ ఫర్ ది లా ఆఫ్ ది సీ'లో తమ సార్వభౌమ హక్కులను కాపాడుకోవడానికి ప్రొవిజనల్ చర్యలు తీసుకోవాలని అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలే కార్యాలయం మంగళవారం అర్జీ దాఖలు చేసింది. ఫాక్‌లాండ్స్ ఉత్తర ప్రాంతంలో ఇజ్రాయెల్-బ్రిటిష్ కంపెనీలు చేపడుతున్న 2.2 బిలియన్ డాలర్ల 'సీ లయన్' (Sea Lion) చమురు ప్రాజెక్టు అభివృద్ధిని అడ్డుకోవాలని అర్జెంటీనా ఈ పిటిషన్‌లో కోరింది. 1833 నుండి బ్రిటన్ తమ మాల్వినాస్ (ఫాక్‌లాండ్) దీవులను అక్రమంగా ఆక్రమించిందని అర్జెంటీనా వాదిస్తుండగా, అక్కడి ప్రజల ఇష్టానుసారమే తాము స్వయంప్రాతిపత్తి కల్పించామని బ్రిటన్ స్పష్టం చేస్తోంది.

అర్జెంటీనాపై బ్రిటన్ ఆగ్రహం - లండన్ స్పందన

అర్జెంటీనా పిటిషన్‌పై బ్రిటన్ విదేశాంగ శాఖ మంత్రి ఉమా కుమారన్ తీవ్రంగా స్పందించారు. అర్జెంటీనా తన పరిధికి మించిన చర్యలను ఉపయోగిస్తూ ఆర్థికంగా వేధించాలని చూస్తోందని హౌస్ ఆఫ్ కామన్స్ సమావేశంలో మండిపడ్డారు. సీ లయన్ చమురు క్షేత్రం ఫాక్‌లాండ్ దీవుల కాంటినెంటల్ షెల్ఫ్‌లో ఉందని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఫాక్‌లాండ్ ప్రభుత్వం దీనికి ఆమోదం తెలిపిందని చెప్పారు. ఫాక్‌లాండ్ ప్రజలపై అర్జెంటీనా ఆర్థిక ఒత్తిడి తీసుకువస్తుంటే బ్రిటన్ చూస్తూ ఊరుకోదని, వారి రక్షణకు ఏ చర్యలకైనా సిద్ధమని స్పష్టం చేశారు.

రాజకీయ లబ్ధి కోసమే మిలే చర్యలా?

1982లో ఈ దీవుల కోసం జరిగిన 10 వారాల భయంకరమైన యుద్ధంలో అర్జెంటీనా సైన్యం బ్రిటన్ చేతిలో ఓడిపోయిన సంగతి తెలిసిందే. కాగా, కొత్తగా చేపడుతున్న సీ లయన్ చమురు ప్రాజెక్టు ద్వారా 2028 నాటికి చమురు ఉత్పత్తి ప్రారంభించాలని ఇజ్రాయెల్‌కు చెందిన నావిటాస్ పెట్రోలియం, బ్రిటన్‌కు చెందిన రాక్‌హాపర్ ఎక్స్‌ప్లోరేషన్ సంస్థలు భావిస్తున్నాయి. వచ్చే ఏడాది జరగనున్న అధ్యక్ష ఎన్నికల నేపథ్యంలో, ఆర్థిక వ్యవస్థ మందగించడంతో దేశంలో తీవ్ర ప్రజాదరణ ఉన్న ఫాక్‌లాండ్స్ అంశాన్ని అధ్యక్షుడు మిలే మళ్లీ తెరపైకి తెచ్చి రాజకీయం చేస్తున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు.

# మానవాళికి వ్యతిరేకంగా జరిగే నేరాల జాబితాలో ఉగ్రవాదాన్ని చేర్చాలి

**ఐయూఎన్ వేదికగా భారత్ డిమాండ్!**
బలగం టీవీ, న్యూయార్క్



మానవాళికి వ్యతిరేకంగా జరిగే నేరాల నివారణ, శిక్షకు సంబంధించిన ప్రతిపాదిత అంతర్జాతీయ కన్వెన్షన్‌లో ఉగ్రవాద సంబంధిత అక్రమాలను కూడా చేర్చాలని భారత్ గట్టిగా కోరింది. 2028లో ఆమోదించనున్న ఈ కన్వెన్షన్‌కు సంబంధించి ఐక్యరాజ్యసమితి (యూఎన్) జనరల్ అసెంబ్లీ 6వ కమిటీ సమావేశంలో భారత్ ఈ డిమాండ్‌ను గట్టిగా వినిపించింది.

జాతీయ సార్వభౌమాధికారం, బాధ్యతలకు పెద్దపీట

ఈ సమావేశంలో భారత్ తరఫున ఐక్యరాజ్యసమితి మిషన్ కౌన్సెలర్ ఆర్. మైథిలి మాట్లాడుతూ.. ఉగ్రవాదులు పాల్పడే దారుణమైన నేరాలు, అకృత్యాలు తగిన స్థాయికి చేరుకున్నప్పుడు వాటిని మానవాళికి వ్యతిరేకంగా జరిగే నేరాల ఫ్రేమ్‌వర్క్‌లో సముచితంగా ప్రతిబింబించాలని స్పష్టం చేశారు. ఉగ్రవాద చర్యల తీవ్రతను పరిగణనలోకి తీసుకుంటూనే, ఇప్పటికే ఉన్న చట్టపరమైన విధానాలను యథావిధిగా బదిలీ చేయకుండా డ్రాఫ్ట్ ఆర్టికల్స్ సమగ్ర దృక్పథానికి అనుగుణంగా దీన్ని పరిశీలించాలని ఆమె పేర్కొన్నారు.

దేశాల బాధ్యతలు మరియు సార్వభౌమాధికారం

తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనలు మరియు సామూహిక అకృత్యాలకు సంబంధించి జాతీయ చట్టాలకు అనుగుణంగా న్యాయం, బాధ్యతను నిర్ధారించే బాధ్యత ఆయా దేశాలపైనే ఉంటుందని భారత్ నొక్కిచెప్పింది. మానవాళికి వ్యతిరేకంగా జరిగే నేరాల నుండి ప్రజలను రక్షించే ప్రాథమిక బాధ్యత దేశాలదేననే నిబంధనను ఈ కన్వెన్షన్ మరింత బలోపేతం చేయాలని మైథిలి పేర్కొన్నారు. అదే సమయంలో, నేరాల నివారణ మరియు శిక్షా చర్యలు చేపట్టేటప్పుడు దేశాల సార్వభౌమాధికారాన్ని, అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోకూడదనే సూత్రాన్ని పూర్తిగా గౌరవించాలని స్పష్టం చేశారు.

2004లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ చేసిన తీర్మానం ప్రకారం.. 2028లో మానవాళికి వ్యతిరేకంగా జరిగే నేరాల నివారణ మరియు శిక్షకు సంబంధించిన సదస్సు జరగనుంది. దీనికి ముందుగా జనవరిలో తొలి సన్నాహక సదస్సు జరుగగా, ఈ అంతర్జాతీయ కన్వెన్షన్‌ను చట్టబద్ధమైన ఒప్పందంగా ఆమోదించడమే ఈ సదస్సు ప్రధాన లక్ష్యంగా ఉంది.

# చమురు ధరలను పెంచేందుకు హూతీల కుట్ర



**: డోనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం!**
బలగం టీవీ, వాషింగ్టన్

అమెరికా మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో ముడి చమురు ధరలను పెంచేందుకు యెమెన్‌కు చెందిన హూతీ తిరుగుబాటుదారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆరోపించారు. సౌదీ అరేబియాపై వారు జరిపిన దాడులను తాను ఎప్పటికీ మరచిపోనని, తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. అమెరికా-ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం ప్రాంతీయ వివాదంగా మారుతున్న నేపథ్యంలో ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయి.

ట్రంప్ హెచ్చరికలు

హూతీలు చాలా దారుణంగా ప్రవర్తిస్తున్నారని ట్రంప్ సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో పేర్కొన్నారు. గతేడాది అమెరికా దాడుల తర్వాత కొంతకాలం శాంతించిన హూతీలు, ఇప్పుడు ఇరాన్ ప్రోద్బలంతో మళ్లీ దాడులకు దిగుతున్నారని ఆరోపించారు. నవంబర్ 3న జరగనున్న మధ్యంతర ఎన్నికల తర్వాత కూడా తాను అధికారంలో ఉంటానని, ఈ దాడులను ఎప్పటికీ విస్మరించబోనని వ్యాఖ్యానించారు.

సౌదీపై దాడులు - టర్కీ సాయం

సౌదీ అరేబియాలోని రియాద్ కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై హూతీలు జరిపిన దాడుల్లో కనీసం 13 మంది మరణించగా, 300 మందికి పైగా గాయపడ్డారు. దీనితో విమానాశ్రయాన్ని మూసివేయాల్సి వచ్చింది. సౌదీ ప్రయోజనాలకు మద్దతుగా జోక్యం చేసుకోవాలని టర్కీ అధ్యక్షుడు తయ్యిప్ ఎర్డోగాన్‌ను కోరే అవకాశం ఉందని ట్రంప్ విలేకరులకు తెలిపారు.

గత ఎనిమిది నెలలుగా సాగుతున్న అమెరికా-ఇరాన్ యుద్ధం మధ్య, ఎర్రసముద్రం మరియు బాబ్ అల్-మందబ్ జలసంధి గుండా వెళ్లే వాణిజ్య నౌకలపై హూతీలు దాడులను తీవ్రం చేశారు. ఈ దాడుల వల్ల ప్రపంచ చమురు సరఫరా మరియు నౌకాయాన మార్గాలకు తీవ్ర విఘాతం కలిగి శక్తి వనరుల (Energy) ధరలు భారీగా పెరిగే ప్రమాదం ఉందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# బాలికల వివాహాల అణచివేత, హక్కుల పరిరక్షణలో భారత్ కృషి

**ఐఎంఎస్ ప్రశంసలు!**
బలగం టీవీ, న్యూఢిల్లీ

బాలికల బాల్య వివాహాలను అరికట్టడంలో, వారి హక్కులను బలపరచడంలో భారత్ చేస్తున్న కృషిని ఐక్యరాజ్యసమితి (యూఎన్) ఘనంగా ప్రశంసించింది. నిరంతర పెట్టుబడులు, పెద్ద ఎత్తున సామాజిక భాగస్వామ్యం ఉంటే సమాజంలో నిజమైన, సార్థకమైన మార్పు తీసుకురావచ్చని భారత్ నిరూపించిందని కొనియాడింది. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఐక్యరాజ్యసమితిలో భారత్, సియెర్రా లియోన్ శాశ్వత మిషన్‌లు సంయుక్తంగా సోమవారం 'బాలికల భవిష్యత్తులో పెట్టుబడి – మన భవిష్యత్తును మార్చడం' అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాయి.

భారత్ సాధించిన ప్రగతి అభినందనీయం: యూనిసెఫ్

ఈ కార్యక్రమంలో యూనిసెఫ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హన్నా సులేమాన్ మాట్లాడుతూ.. బాలికలు అభివృద్ధి చెందితే సమాజం ప్రగతి పథంలో పయనిస్తుందని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యధికంగా 25.3 కోట్ల మంది యుక్తవయస్సులోని కిశోర జనాభా భారత్‌లో ఉందని, అంటే భారత్‌లో బాలికలు సాధించే పురోగతి సరిహద్దులు



దాటి అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంటుందని చెప్పారు. దేశంలో కొనసాగిన విధానపరమైన చర్యలు, 'బాల్య వివాహ రహిత భారత్' వంటి సామాజిక ఉద్యమాల ద్వారా గత దశాబ్ద కాలంలో బాలికల విద్య మెరుగైందని, కుటుంబాలలో బాలికల విలువపై అవగాహన పెరిగిందని తెలిపారు.

డిజిటల్, సాంకేతిక రంగాలలో మహిళా ప్రాధాన్యం: భారత రాయబారి పార్వతనేని హరీశ్

ఐక్యరాజ్యసమితిలో భారత్ శాశ్వత ప్రతినిధి పార్వతనేని హరీశ్ మాట్లాడుతూ.. బాలికల భవిష్యత్తు కోసం చేసే పెట్టుబడులు సమాజానికి ఎంతో ప్రయోజనం చేకూరుస్తాయని పేర్కొన్నారు. 'బేటి బచావో బేటి పఢావో' వంటి కార్యక్రమాలు సామాజిక అసమానతలను తొలగించడంలో, బాలికల పాఠశాల ప్రవేశాలను పెంచడంలో కీలక పాత్ర పోషించాయని వెల్లడించారు. విద్య ద్వారా వివాహ వయస్సు పెరగడం, ఆర్థిక స్థిరత్వం సాధించడం వంటి అంశాలు కుటుంబాల అభివృద్ధికి, తలసరి జీడీపీ వృద్ధికి తోడ్పడుతున్నాయని తెలిపారు.

ఇదే సమయంలో ప్రస్తుత డిజిటల్ యుగంలో ఎదురవుతున్న సవాళ్లపై ఆయన స్పందించారు. కేవలం 'టెక్ బ్రదర్స్' గురించే వింటున్నామని, 'టెక్ సిస్టర్స్' ప్రాముఖ్యతను పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) రంగం క్రమంగా పురుషాధిపత్యంలోకి మారుతున్న నేపథ్యంలో, సైబర్ రంగాన్ని మహిళలు మరియు బాలికలకు సురక్షితమైన ప్రదేశంగా మార్చాల్సిన అవసరం ఉందని హరీశ్ ఉద్ఘాటించారు. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా బాలికల విద్యను మరింత బలోపేతం చేసే దిశగా భారత్ అడుగులు వేస్తోందని ఆయన స్పష్టం చేశారు.

# యెమెన్ రాజధాని సమీపంలోని చమురు నిల్వలపై సౌదీ కూటమి దాడి



**తీవ్రమవుతున్న పశ్చిమాసియా సంక్షోభం!**
బలగం టీవీ, కైరో

పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత తీవ్రస్థాయికి చేరుకున్నాయి. యెమెన్ రాజధాని సనాకు పశ్చిమాన ఉన్న చమురు నిల్వ కేంద్రాలపై సౌదీ అరేబియా నేతృత్వంలోని సైనిక కూటమి మంగళవారం నాడు తీవ్రస్థాయిలో వైమానిక దాడులు నిర్వహించింది. సనాలోని అల్-సుబాహా ప్రాంతంలో ఉన్న యెమెన్ పెట్రోలియం కంపెనీ (YPC) ఇంధన నిల్వ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగాయని హూతీ అనుకూల అల్-మసీరా మీడియా ధృవీకరించింది.

తీవ్ర హెచ్చరికల మధ్య వైమానిక దాడులు

ఈ దాడులకు ముందు సౌదీ కూటమి ప్రజా భద్రత దృష్ట్యా చమురు కేంద్రాలు, పరిసర ప్రాంతాల నుంచి స్థానికులు వెంటనే ఖాళీ చేసి వెళ్లిపోవాలని అరుదైన ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రకటన వెలువడిన కొద్ది సేపటికే నగరంలో భారీ పేలుడు శబ్దాలు వినిపించాయని ప్రత్యక్షసాక్షులు వెల్లడించారు. అయితే, ముందస్తు దాడుల అంచనాతో ఆ చమురు డిపోలలో నిల్వలు ఏమీ లేవని, ఈ దాడుల వల్ల ప్రజలకు ఇంధన కొరత ఏర్పడదని హూతీ ప్రతినిధులు పేర్కొన్నారు. కాగా, సనాపై దాడులు కొనసాగితే రియాద్‌పై కూడా అంతే తీవ్రమైన రీతిలో ప్రతీకార దాడులు ఉంటాయని హూతీ సైనిక ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ యాహ్యా సారీ హెచ్చరించారు.

దాడులకు గల కారణాలు మరియు దౌత్యపరమైన పరిణామాలు

ఇటీవల రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై హూతీలు జరిపిన డ్రోన్, మిస్సైల్ దాడులలో 13 మంది మరణించగా, 300 మందికి పైగా గాయపడ్డారు. ఈ భద్రతా లోపాలపై సౌదీ విచారణ జరుపుతున్న తరుణంలోనే తాజాగా ప్రతీకార చర్యలకు దిగింది. ఎర్రసముద్రం వద్ద ఉన్న బాబ్ అల్-మందబ్ జలసంధి ప్రాంతాన్ని హూతీలు స్వాధీనం చేసుకున్నప్పటి నుంచి ఈ ఘర్షణలు మరింత తీవ్రమయ్యాయి.

మరోవైపు, సౌదీ అరేబియాపై దాడులను హూతీలు వెంటనే నిలిపివేయాలని ఈజిప్ట్ విదేశాంగ మంత్రి బదర్ అబ్దెలాటీ డిమాండ్ చేశారు. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చితో ఫోన్లో మాట్లాడిన ఆయన, ఈ దాడులకు ఎలాంటి సమర్థనా లేదని, అమెరికా-ఇరాన్ వివాదాన్ని దౌత్యపరమైన చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని కోరారు.

# గ్రీస్‌కు 22 పురాతన కళాఖండాలను అప్పగించిన ఇజ్రాయెల్

**సాంస్కృతిక సంబంధాల్లో కొత్త అధ్యాయం!**
బలగం టీవీ, ఏథెన్స్



గ్రీస్ నుంచి అక్రమంగా తరలించబడిన 22 పురాతన కళాఖండాలను ఇజ్రాయెల్ మంగళవారం తిరిగి ఆ దేశానికి అప్పగించింది. ఏథెన్స్‌లోని నేషనల్ ఆర్కియోలాజికల్ మ్యూజియంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఇజ్రాయెల్ యాంటిక్విటీస్ అథారిటీ ప్రతినిధులు, ఇజ్రాయెల్ రాయబారి ప్లానిట్ యానైల నుంచి గ్రీస్ సాంస్కృతిక మంత్రి లీనా మెండోనీ ఈ కళాఖండాలను స్వీకరించారు.

దౌత్య ప్రాధాన్యత మరియు కళాఖండాల వివరాలు

ఇజ్రాయెల్ నుంచి గ్రీస్‌కు పురాతన కళాఖండాలు తిరిగి రావడం చరిత్రలో ఇదే తొలిసారి. సాంస్కృతిక వారసత్వ పరిరక్షణలో ఇరు దేశాల మధ్య మరింత బలమైన సహకారానికి ఇది నాంది అని లీనా మెండోనీ పేర్కొన్నారు. ఈ సేకరణలో క్రీస్తు పూర్వం 700 నుండి 320 మధ్య కాలానికి చెందిన స్త్రీ కాంస్య విగ్రహం, పౌరాణిక ఘట్టాలు మరియు రేఖాగణిత చిత్రాలతో అలంకరించబడిన పాత్రలు, ఆయిల్ ఫ్లాస్కులు ఉన్నాయి. చట్టవిరుద్ధంగా జరిగే కళాఖండాల వ్యాపారంపై ఇజ్రాయెల్ అధికారులు జరిపిన విచారణలో వీటిని స్వాధీనం చేసుకున్నట్లు రాయబారి తెలిపారు.

లండన్‌లోని బ్రిటీష్ మ్యూజియంలో ఉన్న 2,500 ఏళ్ల నాటి పార్థెనాన్ మార్బుల్స్ స్కల్ప్చర్లను తిరిగి తీసుకురావడానికి గ్రీస్ విస్తృతంగా అంతర్జాతీయ ప్రచారాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఇరు దేశాల మధ్య ఇటీవలి కాలంలో రక్షణ, ఇంధన రంగాలు బాగా బలోపేతమయ్యాయి. అందులో భాగంగానే ఆగస్టు నెలలో గ్రీస్‌లో 'అకిలెస్ షీల్డ్' పేరిట ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ నిర్మించేందుకు ఇజ్రాయెల్ దాదాపు 3.5 బిలియన్ డాలర్ల రక్షణ ఒప్పందాన్ని కుదుర్చుకుంది.

# నేడే హైదరాబాద్‌లో భారత్-వెస్టిండీస్ నాలుగో టీ20






## పరుగుల వరద సృష్టించేందుకు రంగం సిద్ధం!

బలగం టీవీ, హైదరాబాద్

ఇండోర్ వేదికగా జరిగిన మూడో టీ20లో స్వల్ప స్కోర్ల మ్యాచ్ తర్వాత, భారత్-వెస్టిండీస్ మధ్య ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో అత్యంత కీలకమైన నాలుగో టీ20 మ్యాచ్‌కు హైదరాబాద్‌లోని ఉప్పల్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికవుతోంది. ప్రస్తుతం ఈ సిరీస్‌లో భారత్ 2-1 ఆధిక్యంలో కొనసాగుతుండగా, సిరీస్‌ను కైవసం చేసుకోవాలని భారత్ భావిస్తుంటే.. సిరీస్‌లో నిలవాలంటే విండీస్‌కు ఈ మ్యాచ్ గెలవడం చాలా ముఖ్యం.

పిచ్ స్వభావం & బ్యాటింగ్ రికార్డులు:

ఇండోర్ లాంటి నెమ్మదైన పిచ్‌ల తర్వాత, ఇప్పుడు సిరీస్ పూర్తిగా బ్యాటింగ్‌కు అనుకూలించే హైదరాబాద్‌కు మారుతోంది.

హైదరాబాద్ పిచ్‌లో గతంలో 208 మరియు 187 పరుగుల విజయవంతమైన లక్ష్య ఛేదనలు జరిగాయి. అంతేకాకుండా, ఒకసారి భారత్ ఇక్కడ దాదాపు 300 పరుగుల మార్కును చేరుకుని, పూర్తి సభ్య దేశాల మధ్య జరిగిన టీ20లలో రెండో అత్యధిక స్కోర్‌ను నమోదు చేసింది.

ఐపీఎల్‌లో అత్యంత దూకుడుగా ఆడే సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు ఇదే హోమ్‌గ్రౌండ్ కావడంతో, ఇక్కడి బ్యాటింగ్ పరిస్థితులు మరోసారి పరుగుల వరద సృష్టించే అవకాశం ఉంది. ఒకవేళ మంచు (Dew) ప్రభావం ఉంటే మాత్రం బౌలర్లకు పరీక్ష తప్పదు.

కీలక ఆటగాళ్ల పోరు:

వెస్టిండీస్ బౌలర్ రోస్టన్ చేజ్ ఎడమవాటపు బ్యాటర్లపై తన కచ్చితమైన బౌలింగ్‌తో ప్రభావం చూపుతున్నాడు. అయితే, గత మ్యాచ్‌లో చేజ్ బౌలింగ్‌లో అభిషేక్ శర్మ అద్భుతంగా పుంజుకుని రెండు సిక్సర్లు, ఒక ఫోర్ బాదారు.

సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ఆడుతున్న అభిషేక్ శర్మకు ఇది హోమ్‌గ్రౌండ్ కావడంతో, వీరిద్దరి మధ్య జరిగే పోరు మ్యాచ్‌కే ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. మరోవైపు కేవలం 1024 బంతుల్లోనే 2000 T20I పరుగుల మైలురాయిని చేరుకుని సరికొత్త రికార్డు సృష్టించిన అభిషేక్ శర్మ మరోసారి మెరుపులు మెరిపించాలని చూస్తున్నాడు.

జట్ల అంచనా వివరాలు:

భారత్ (అంచనా): అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ, నామన్ ధీర్, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్. (ఇండోర్ మ్యాచ్‌లో అదనపు పేసర్‌తో బరిలోకి దిగిన భారత్, ఇక్కడ కూడా అదే కాంబినేషన్‌ను కొనసాగించే అవకాశం ఉంది).

వెస్టిండీస్ (అంచనా): షై హోప్ (కెప్టెన్, వికెట్ కీపర్), కమిల్ పూరన్, షిమ్రాన్ హెట్మేయర్, రోవ్‌మన్ పావెల్, షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్, రొమారియో షెపర్డ్/క్వింటిన్ సాంప్సన్, రోస్టన్ చేజ్, షమర్ స్ప్రింగర్, కీమో పాల్, షమర్ జోసెఫ్, గుడాకేష్ మోటి. (గాయం కారణంగా గత మ్యాచ్‌కు దూరమైన రొమారియో షెపర్డ్ ఫిట్‌నెస్పై విండీస్ జట్టు ఆధారపడి ఉంది).

వర్షం ముప్పు లేకపోవడంతో క్రికెట్ అభిమానులకు సరికొత్త వినోదం దక్కడం ఖాయంగా కనిపిస్తోంది.

# ప్రపంచకప్ టికెట్ బ్యాలెట్‌కు ఆకాశాన్నంటిన డిమాండ్

## 12 రోజుల్లోనే 1.5 కోట్లకు పైగా దరఖాస్తులు!

బలగం టీవీ, దుబాయ్

2027లో దక్షిణాఫ్రికా, జింబాబ్వే మరియు నమీబియా దేశాలు సంయుక్తంగా నిర్వహించనున్న 'ఐసీసీ పురుషుల క్రికెట్ ప్రపంచకప్' టికెట్ల కొనుగోలుకు ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానుల నుంచి ఊహించని రీతిలో భారీ స్పందన లభిస్తోంది. టికెట్ బ్యాలెట్ ప్రారంభమైన కేవలం 12 రోజుల్లోనే అత్యధిక సంఖ్యలో దరఖాస్తులు నమోదైనట్లు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ICC) ప్రకటించింది.

మొత్తంగా 142 దేశాల నుంచి 44.2 లక్షల (4,423,417) మంది అభిమానులు నమోదు చేసుకోగా, రికార్డు స్థాయిలో 1.5 కోట్లకు పైగా (15,083,752) టికెట్ దరఖాస్తులు వచ్చాయి. గత వారంలో కోటిగా ఉన్న దరఖాస్తుల సంఖ్య, రెండు వారాలు తిరక్కుండానే 1.5 కోట్లు దాటడం ఈ మెగా టోర్నీపై ఉన్న ప్రపంచ స్థాయి క్రేజ్‌ను తెలియజేస్తోంది. 24 ఏళ్ల విరామం తర్వాత ఆఫ్రికా ఖండంలో క్రికెట్ ప్రపంచకప్ మళ్లీ జరుగుతుండటం విశేషం.

ఈ అపూర్వ స్పందనపై ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సంజోగ్ గుప్తా హర్షం వ్యక్తం చేశారు. "టికెట్లకు లభిస్తున్న ఈ అపారమైన డిమాండ్ క్రికెట్ ప్రపంచకప్ స్థాయికి, ఆఫ్రికా పర్యటనపై ఉన్న ఆసక్తికి నిదర్శనం. టోర్నీ ప్రారంభానికి ఏడాది సమయం ఉన్నప్పటికీ, అభిమానులను మరింత ఉత్సాహపరిచేందుకు విస్తృత స్థాయి ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు.

బ్యాలెట్ ప్రక్రియ వివరాలు:

గడువు: జోహన్నెస్‌బర్గ్‌లోని వాండరర్స్ మైదానంలో ఫైనల్ మ్యాచ్ జరగడానికి సరిగ్గా ఏడాది ముందు, అనగా 2026 నవంబర్ 21 రాత్రి 23:59 (CAT) వరకు ఈ టికెట్ బ్యాలెట్ రిజిస్ట్రేషన్ అందుబాటులో ఉంటుంది.




ఉచిత నమోదు: బ్యాలెట్‌లో నమోదు చేసుకోవడానికి ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు.

ఎంపిక విధానం: ఇది 'ముందు వచ్చిన వారికి మొదటి ప్రాధాన్యత' (First-come, first-served) పద్ధతి కాదు. దరఖాస్తు చేసుకున్న వారి నుండి లాటరీ (Randomised Ballot) విధానంలో విజేతలను ఎంపిక చేసి, ఇమెయిల్ ద్వారా టికెట్లు కొనుగోలు చేసే అవకాశాన్ని కల్పిస్తారు.

14వ ఎడిషన్ పురుషుల క్రికెట్ ప్రపంచకప్ అక్టోబర్ 2న నమీబియాలోని విండ్‌హోక్ వేదికగా 'సూపర్ సిరీస్'తో ఘనంగా ప్రారంభం కానుంది.

# ఢిల్లీ క్యాపిటల్స్ అసిస్టెంట్, బ్యాటింగ్ కోచ్‌గా యువరాజ్ సింగ్




బలగం టీవీ, ఢిల్లీ

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2027 సీజన్‌కు సంబంధించి ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు కీలక ప్రకటన చేసింది. భారత మాజీ ప్రపంచ కప్ విజేత ఆల్ రౌండర్ యువరాజ్ సింగ్‌ను తమ జట్టుకు అసిస్టెంట్ మరియు బ్యాటింగ్ కోచ్‌గా నియమించినట్లు మంగళవారం వెల్లడించింది. ఢిల్లీ ఫ్రాంచైజీ హెడ్ కోచ్‌గా సౌరవ్ గంగూలీని ప్రకటించిన వారం రోజుల వ్యవధిలోనే ఈ నియామకం వెలువడడం విశేషం.

యువరాజ్ సింగ్ భావోద్వేగ స్పందన

ఢిల్లీ క్యాపిటల్స్‌తో తన కొత్త ప్రయాణంపై యువరాజ్ సింగ్ సంతోషం వ్యక్తం చేశారు. ఫ్రాంచైజీ యజమానులతో తనకు పాత అనుబంధం ఉందని, కోచింగ్ పట్ల తనకు మక్కువ ఎక్కువని తెలిపారు. మరోసారి 'దాదా' (సౌరవ్ గంగూలీ) తో కలిసి కోచింగ్ సిబ్బందిగా పనిచేయడం సంతోషంగా ఉందని, ఈ ప్రతిభావంతమైన జట్టుతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఫ్రాంచైజీతో పాత అనుబంధం

2015 ఐపీఎల్ సమయంలో అప్పట్లో ఢిల్లీ డేర్‌డెవిల్స్ జట్టు రికార్డు స్థాయిలో రూ. 16 కోట్లకు యువరాజ్ సింగ్‌ను కొనుగోలు చేసింది. ఆ సీజన్‌లో ఆయన అన్ని మ్యాచ్‌లలోనూ ప్రాతినిధ్యం వహించారు. ఇప్పుడు కోచ్ రూపంలో ఆయన మళ్లీ ఆ జట్టుతో కలవడం విశేషం. యువరాజ్ గతంలో శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, ప్రభ్‌సిమ్రన్ సింగ్ వంటి యువ ఆటగాళ్లకు మెంటార్‌గా వ్యవహరించారు.

మేనేజ్‌మెంట్ హర్షం

యువరాజ్ నియామకంపై జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్ వ్యవస్థాపకుడు, ఢిల్లీ క్యాపిటల్స్ కో-ఓనర్ పార్థ్ జిందాల్ హర్షం వ్యక్తం చేశారు. యువరాజ్ లాంటి మ్యాచ్ విన్నర్ అనుభవం, విన్నింగ్ మైండ్‌సెట్ యువ ఆటగాళ్లకు అమూల్యమైనదానిని కొనియాడారు. గంగూలీతో కలిసి ఆయన చేసే ప్రయాణం జట్టుకు ఎంతో లాభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఐపీఎల్ చరిత్రలో ఇప్పటివరకు ఒక్కసారూ టైటిల్ గెలవని ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు, 2020లో ఒక్కసారి మాత్రమే ఫైనల్‌కు చేరుకుంది.

# ముంబై, ఉత్తరప్రదేశ్, హైదరాబాద్ ఘన విజయాలు!



బలగం టీవీ, హైదరాబాద్

రంజీ ట్రోఫీలో భాగంగా మంగళవారం జరిగిన మూడో రోజు ఆటలో మూడు జట్లు ఇన్నింగ్స్ తేడాతో ఘన విజయాలు నమోదు చేశాయి. ముంబై జట్టు చండీగఢ్‌పై ఇన్నింగ్స్ మరియు 155 పరుగుల తేడాతో విజయం సాధించగా, ఉత్తరప్రదేశ్ జట్టు బీహార్‌పై ఇన్నింగ్స్ మరియు 267 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. మరోవైపు త్రిపురతో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు ఇన్నింగ్స్ మరియు 40 పరుగుల తేడాతో విజయాన్ని కైవసం చేసుకుంది.

ఇతర మ్యాచ్‌ల విషయానికి వస్తే, ఢిల్లీపై బెంగాల్ తన స్థితిని మరింత బలోపేతం చేసుకోగా, జార్ఖండ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో కేరళ భారీ లోటును ఎదుర్కొంటోంది. హిమాచల్ ప్రదేశ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో హర్యానా జట్టు సులభమైన లక్ష్య ఛేదనలో ముగ్గురు ప్రారంభ బ్యాటర్లను త్వరగానే కోల్పోవడంతో కాస్త ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటోంది. అలాగే సర్వీసెస్‌తో జరిగిన మ్యాచ్‌లో మహారాష్ట్ర జట్టు 66 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అడ్మినిస్ట్రేటివ్ వివాదం కారణంగా అరుణాచల్ ప్రదేశ్ - నాగాలాండ్ మ్యాచ్ రద్దు కాగా, దేశవ్యాప్తంగా మరో 15 మ్యాచ్‌లు ఇంకా ముగియాల్సి ఉంది.

# ఉప్పల్‌లో టీ20 మ్యాచ్.. భారీ ట్రాఫిక్ ఆంక్షలు

బలగం టీవీ, హైదరాబాద్

ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో బుధవారం భారత్-వెస్టిండీస్ జట్ల మధ్య నాల్గో టీ20 అంతర్జాతీయ మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీసులు భారీ ఏర్పాట్లు చేశారు. మ్యాచ్‌ను చూసేందుకు భారీగా అభిమానులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 11.50 గంటల వరకు ప్రత్యేక ఆంక్షలు మరియు మళ్లింపులు అమల్లో ఉంటాయని తెలిపారు.

ట్రాఫిక్ మళ్లింపులు & ప్రత్యామ్నాయ మార్గాలు:

నాగోల్ నుంచి ఉప్పల్ జంక్షన్ మీదుగా హబ్సిగూడ వరకు, బోడుప్పల్ నుంచి ఉప్పల్ జంక్షన్ మరియు రామంతాపూర్ మీదుగా అంబర్‌పేట వరకు భారీగా రద్దీ ఏర్పడే అవకాశం ఉంది.

ఘట్‌కేసర్ వైపు నుంచి వచ్చే భారీ వాహనాలను (లారీలు, టిప్పర్లు, బస్సులు మొదలైనవి) మెహ్ఫిల్ హోటల్ సమీపంలోని హెచ్ఎండీఏ ఉప్పల్ భగాయత్ ప్రవేశద్వారం వద్ద నాగోల్-ఎల్‌బీనగర్ వైపు మళ్లిస్తారు.

ఎల్‌బీనగర్ వైపు నుంచి వచ్చే భారీ వాహనాలను నాగోల్ యూటర్న్, భగాయత్, బోడుప్పల్, చెంగిచెర్ల మీదుగా ఘట్‌కేసర్ వైపు పంపిస్తారు.

తార్నాక, రామంతాపూర్ వైపు నుంచి వచ్చే వాహనాలను హబ్సిగూడ ఎక్స్‌రోడ్డు వద్ద మళ్లించి నాచారం, ఐడీఏ చెర్లపల్లి మీదుగా మళ్లిస్తారు. వరంగల్ వైపు వెళ్లేవారు ఓఆర్ఆర్ మార్గాన్ని ఉపయోగించాలని సూచించారు.

ప్రేక్షకుల కోసం పార్కింగ్ ప్రాంతాలు: మ్యాచ్‌కు వచ్చే సాధారణ ప్రేక్షకుల వాహనాల నిమిత్తం స్టేడియం వెలుపల నాలుగు ప్రత్యేక పార్కింగ్ స్థలాలను కేటాయించారు:

హబ్సిగూడ వైపు నుంచి వచ్చేవారు: సర్వే ఆఫ్ ఇండియా వద్ద యూటర్న్ తీసుకుని ఈకే మినార్ సమీపంలోని టీజీ ఐఏఎలా (TG IALA) పార్కింగ్ స్థలంలో వాహనాలు నిలపాలి.

ఎల్‌బీనగర్, రామంతాపూర్ వైపు నుంచి వచ్చేవారు: జైన్ ప్రాపర్టీస్, మోడ్రన్ బేకరీ సమీపంలోని స్థలాలు అలాగే ఎన్ఎస్ఎల్ భవనం ఎదురుగా ఉన్న డీఎస్ఎల్ ఖాళీ స్థలాన్ని వినియోగించుకోవాలి.

స్టేడియంలోని 'ఏ' గ్రౌండ్ పార్కింగ్ కేవలం వీవీఐపీలు, వీఐపీలు మరియు అధికారిక పాస్‌లు ఉన్న వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుంది (గేట్ నెం. 1ఏ ద్వారా).

ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రేక్షకులు వ్యక్తిగత వాహనాలకు బదులుగా ఆర్టీసీ బస్సులు, మెట్రో రైళ్ల వంటి ప్రజా రవాణాకు ప్రాధాన్యత ఇవ్వాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.





# డెన్మార్క్ ఓపెన్‌లో తొలి రౌండ్లోనే సింధు, లక్ష్య సేన్ అవుట్..

బలగం టీవీ, హైదరాబాద్

డెన్మార్క్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ షట్లర్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. టోర్నమెంట్‌లో భాగంగా మంగళవారం జరిగిన సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లలో పీవీ సింధు, లక్ష్య సేన్ లు తొలి రౌండ్లోనే వెనుకంజ వేయగా.. కిడాంబి శ్రీకాంత్, తన్వి శర్మ పోరాడి విజయం సాధించి రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లారు.

సింధు, లక్ష్య సేన్ పోరాడి ఓటమి

మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు జర్మనీకి చెందిన తక్కువ ర్యాంక్ ఆటగత్తె యవోన్ లి చేతిలో 21-13, 23-25, 19-21 తేడాతో పరాజయం పాలైంది. ఎస్‌జేఎఫ్ బ్యాంక్ అరేనాలో గంటా ఐదు నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో సింధు చివరి వరకు పోరాడినప్పటికీ విజయం సాధించలేకపోయింది. జూలైలో జపాన్ ఓపెన్ టైటిల్ గెలుచుకున్న సింధు, గత వారం ఆర్కిటిక్ ఓపెన్‌లో క్వార్టర్స్ వరకు వెళ్లినప్పటికీ ఇక్కడ మాత్రం నిరాశపరిచింది. మరోవైపు పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో లక్ష్య సేన్ 18-21, 21-13, 15-21 తేడాతో మూడో సీడ్ చౌ తియెన్ చెన్ చేతిలో ఓడిపోయాడు.

శ్రీకాంత్, తన్వి శర్మ ముందంజ

పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో కిడాంబి శ్రీకాంత్ 46 నిమిషాల్లో 22-20, 21-19తో ఫ్రాన్స్‌కు చెందిన ఆర్నాడ్ మెర్కేపై విజయం సాధించి ప్రిక్వార్టర్స్‌లోకి ప్రవేశించాడు. 2017లో ఇక్కడ ఛాంపియన్‌గా నిలిచిన శ్రీకాంత్, తదుపరి రౌండ్‌లో ఏడో సీడ్ అలెక్స్ లానియర్‌తో తలపడనున్నాడు. అలాగే మహిళల సింగిల్స్‌లో తన్వి శర్మ గంటా 12 నిమిషాల పాటు శ్రమించి 21-17, 16-21, 21-19తో నట్సుకి నిడైరాను ఓడించి తదుపరి రౌండ్‌కు అర్హత సాధించింది. తన్వి తన తదుపరి మ్యాచ్‌లో యవోన్ లితో ఆడనుంది.

# ఐపీఎల్ స్టేకహోల్డర్లతో జరగాల్సిన బీసీసీఐ సమావేశం వాయిదా!

బలగం టీవీ, ముంబై

అక్టోబర్ 15న ముంబై వేదికగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ (IPL) స్టేకహోల్డర్లతో జరగాల్సిన సమావేశాన్ని బీసీసీఐ వాయిదా వేసింది. బోర్డు కార్యదర్శి దేవజిత్ సైకియా మంగళవారం ఈ విషయాన్ని వెల్లడించారు. ఐపీఎల్ త్వరలో తన మైలురాయి అయిన 20వ సీజన్‌లోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో, ఫ్రాంచైజీల యజమానులు, సీఈవోలు, హోస్టింగ్ స్టేట్ అసోసియేషన్లు మరియు బ్రాడ్‌కాస్టర్లతో కలిసి అక్టోబర్ 15న ముంబైలో ఈ సంయుక్త సమావేశాన్ని నిర్వహించాలని తొలుత నిర్ణయించారు.

వాయిదా పడటానికి కారణం: ఇటీవల ముగిసిన ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాలు సాధించిన భారత పురుషుల, మహిళా క్రికెట్ జట్లను అక్టోబర్ 15న న్యూఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సత్కరించనున్నారు. ఈ సత్కార వేడుకకు బీసీసీఐ అధికారులు హాజరుకావాల్సి ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాఖ్య తెలిపింది. దీనికి తోడు పలువురు స్టేకహోల్డర్లు కూడా సమావేశాన్ని వాయిదా వేయాలని కోరడంతో, అందరి భాగస్వామ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మీటింగ్‌ను వాయిదా వేస్తున్నట్లు బోర్డు వెల్లడించింది.

సమావేశానికి సంబంధించిన కొత్త తేదీ మరియు వేదిక వివరాలను త్వరలోనే తెలియజేస్తామని బీసీసీఐ పేర్కొంది.





# ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' గా శుభ్‌మన్ గిల్, షఫాలీ వర్మ

బలగంటీవీ, దుబాయ్

సెప్టెంబర్ నెలకుగాను 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డులను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) మంగళవారం ప్రకటించింది. పురుషుల క్రికెట్ విభాగంలో భారత వన్డే, టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఈ అవార్డును దక్కించుకోగా, మహిళల విభాగంలో భారత ఓపెనర్ షఫాలీ వర్మ గెలుచుకున్నారు.

**రికార్డు సృష్టించిన శుభ్‌మన్ గిల్**

వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచినందుకు గాను 27 ఏళ్ల గిల్ రికార్డు స్థాయిలో ఐదోసారి 'ఐసీసీ మెన్స్ ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డుకు ఎంపికయ్యాడు. తిరువనంతపురంలో జరిగిన తొలి వన్డేలో 110 పరుగులు చేసిన గిల్, ఆ తర్వాత మ్యాచ్‌లో కేవలం 133 బంతుల్లోనే 223 పరుగులు చేసి వన్డేల్లో అత్యంత వేగంగా డబుల్ సెంచరీ సాధించిన ఆటగాడిగా నిలిచాడు. ఈ విజయంతో ఐదుసార్లు ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్'గా నిలిచిన వెస్టిండీస్ మహిళా జట్టు కెప్టెన్ హేలీ మాథ్యూస్ రికార్డును గిల్ సమం చేశాడు. గిల్ గతంలో 2023 జనవరి, సెప్టెంబర్, అలాగే 2025 ఫిబ్రవరి, జులై నెలల్లో ఈ అవార్డులను గెలుచుకున్నాడు. ఈసటి పురుషుల విభాగంలో గిల్‌తో పాటు అభిషేక్ శర్మ, జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా పోటీపడ్డారు.

**షఫాలీ వర్మకు రెండోసారి**

ఆసియా కప్, ఆసియా క్రీడల్లో అంచనాలకు మించి అద్భుత ప్రదర్శన కనబరిచినందుకు గాను మహిళల విభాగంలో భారత ఓపెనర్ షఫాలీ వర్మ ఈ అవార్డును సొంతం చేసుకుంది. మహిళల ఆసియా కప్‌లో భారత్ విజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించిన షఫాలీ, ఆ టోర్నీలో మొత్తం 360 పరుగులు చేసి, 6 వికెట్లు పడగొట్టింది. అంతేకాకుండా 184.61 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసి ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి పెంచింది. గతంలో 2025 నవంబర్‌లో ఈ అవార్డు గెలుచుకున్న షఫాలీకి, ఇది రెండోసారి కావడం విశేషం. ఈ విభాగంలో షఫాలీతో పాటు శ్రీలంక కెప్టెన్ చమరి అటపట్టు, భారత స్పిన్నర్ శ్రీ చరణి పోటీలో నిలిచారు.

పురుషులు, మహిళల విభాగాల్లో ఒకే దేశానికి చెందిన ఆటగాళ్లు ఒకే నెలలో ఈ అవార్డులను గెలుచుకోవడం ఇది ఐదోసారి కావడం గమనార్హం. గతంలో 2024 జూన్‌లో జస్ప్రీత్ బుమ్రా, స్మృతి మంధాన.. 2025 సెప్టెంబర్‌లో అభిషేక్ శర్మ, స్మృతి మంధాన ఈ ఘనత సాధించగా, తాజాగా శుభ్‌మన్ గిల్, షఫాలీ వర్మ ఈ జాబితాలో చేరారు.




# డర్బన్ టెస్టులో ఆస్ట్రేలియా సంచలన విజయం

## దక్షిణాఫ్రికాకు భారీ షాక్!

బలగం టీవీ, డర్బన్

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ విజేత దక్షిణాఫ్రికా జట్టుకు ఆస్ట్రేలియా గట్టి ఎదురుదెబ్బ ఇచ్చింది. స్వదేశంలో గత రెండేళ్లుగా వరుస విజయాలతో దూసుకెళ్తున్న సఫారీ జట్టును డర్బన్ టెస్టులో ఆస్ట్రేలియా చిత్తుగా ఓడించింది. నాలుగో ఇన్నింగ్స్‌లో జోష్ హేజిల్‌వుడ్ (6/49) ఆరు వికెట్లతో చెలరేగడంతో ఆతిథ్య దక్షిణాఫ్రికా జట్టు రెండో సెషన్‌లోనే కుప్పకూలింది. ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 214 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.

డర్బన్ టెస్టులో కీలక పరిణామాలు:

మార్క్‌రమ్ పోరాటం వృథా: 421 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ఓపెనర్ ఎడెన్ మార్క్‌రమ్ (75) అర్ధశతకంతో ఒంటరి పోరాటం చేసినప్పటికీ జట్టును గెలిపించలేకపోయాడు.

హేజిల్‌వుడ్ వికెట్ల వరద: ఐదో రోజు ఆటలో సఫారీలు విజయానికి 319 పరుగులు చేయాల్సి ఉండగా, చేతిలో 4 వికెట్లు ఉన్నాయి. అయితే, హేజిల్‌వుడ్ అద్భుతమైన బౌలింగ్‌తో ముల్డర్ (29), మార్కో యాన్సెన్ (35), సైమన్ హార్మర్ (0) వంటి కీలక వికెట్లను పడగొట్టి దక్షిణాఫ్రికా పతనానికి కారణమయ్యాడు.

చివరికి దక్షిణాఫ్రికా జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 206 పరుగులకే పరిమితమైంది. బ్యాటింగ్‌లో రాణించిన మ్యాట్ రెన్‌షా (2/30) బంతితోనూ మెరిశాడు.

ఈ విజయంతో డర్బన్ కింగ్స్‌మీడ్ స్టేడియంలో ఆస్ట్రేలియాకు ఇది వరుసగా నాలుగో విజయం కాగా, టెస్టు గద విజేతగా నిలిచిన తర్వాత కెప్టెన్ టెంబా బావుమా నేతృత్వంలో సఫారీలకు ఇదే తొలి ఓటమి కావడం గమనార్హం.

ఇరు జట్ల మధ్య రెండో టెస్టు మ్యాచ్ అక్టోబర్ 18 ఆదివారం నుంచి ప్రారంభం కానుంది.

బలగం TV BALAGAM
balagamtv100@gmail.com

# డిసెంబర్ 4న విజయ్ సేతుపతి 'ట్రైన్'..










## నితిన్, నాగచైతన్య సినిమాలకు గట్టి పోటీ!

తమిళ స్టార్ హీరో విజయ్ సేతుపతి నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'ట్రైన్' విడుదల తేదీ ఖరారైంది. చాలా కాలంగా వాయిదా పడుతూ వస్తున్న ఈ సినిమాను 2026 డిసెంబర్ 4న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ విషయాన్ని విజయ్ సేతుపతి సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించారు. విడుదల తేదీతో పాటు కొత్త పోస్టర్‌ను కూడా పంచుకున్నారు. దీంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. డిసెంబర్ మొదటి వారంలో ప్రభాస్ నటిస్తున్న 'ఫౌజీ' విడుదలవుతుందని అభిమానులు ఆశించినప్పటికీ, ఆ సినిమా వాయిదా పడినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో డిసెంబర్ 4న పలు సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. నితిన్ నటించిన 'అలియాస్ రుక్మిణి', నాగచైతన్య ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'వృషకర్మ', విశ్వక్ సేన్ నటిస్తున్న 'లెగసీ' చిత్రాలు అదే తేదీన విడుదల కానున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు విజయ్ సేతుపతి 'ట్రైన్' కూడా అదే రోజున విడుదలకు సిద్ధమవడంతో బాక్సాఫీస్ వద్ద పోటీ మరింత ఆసక్తికరంగా మారింది. విజయ్ సేతుపతికి తమిళంతో పాటు తెలుగులోనూ అభిమానులు ఉండటంతో, ఈ సినిమా తెలుగు ప్రేక్షకుల ముందుకు కూడా వస్తే ఇతర చిత్రాలకు పోటీ ఎదురయ్యే అవకాశం ఉంది. అయితే, అన్ని సినిమాల విడుదల తేదీలపై ఆయా చిత్ర బృందాల తాజా అధికారిక ప్రకటనలను బట్టి పూర్తి స్పష్టత రానుంది. 'ట్రైన్' సినిమాకు దర్శకుడు మిస్కిన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రానికి ఆయనే సంగీతాన్ని కూడా అందిస్తున్నారు. వి క్రియేషన్స్ పతాకంపై కలైపులి ఎస్. థాను నిర్మిస్తున్నారు. విజయ్ సేతుపతితో పాటు శ్రుతి హాసన్, నాజర్, డింపుల్ హయతి, జయరామ్, నరైన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. విజయ్ సేతుపతి విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మిస్కిన్ దర్శకత్వంలో రూపొందుతున్న 'ట్రైన్'లో ఆయన ఎలాంటి పాత్రలో కనిపిస్తారన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ సినిమా ఇప్పుడు ప్రకటించిన తేదీకి విడుదలవుతుందా అన్నది కూడా చూడాలి.

# ధనుష్ సినిమాను యష్ చేస్తున్నాడా..



కన్నడ రాకింగ్ స్టార్ యష్, తమిళ డైరెక్టర్ పీఎస్ మిత్రన్ కాంబినేషన్‌లో ఓ అడ్వెంచర్ మూవీ తెరకెక్కనుందనే వార్తలు ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. అయితే, ఈ ప్రాజెక్ట్ మొదట ధనుష్ కోసం ప్లాన్ చేసినదేనని, ఇప్పుడు ఆయన స్థానంలో యష్ వచ్చాడనే ప్రచారంపై కొంత గందరగోళం నెలకొంది. దీనిపై క్లారిటీ కావాలని అభిమానులు కోరుతున్నారు. పీఎస్ మిత్రన్ గతంలోనే 'ఇండియానా జోన్స్' తరహాలో ఒక అడ్వెంచర్ కథను యష్‌కు వినిపించాడట. ఆ సమయంలో డేట్స్ కుదరకపోవడంతో ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కలేదు. ఇప్పుడు యష్ తన ప్రస్తుత కమిట్‌మెంట్స్ పూర్తి చేసిన తర్వాత ఈ ఆలోచనను మళ్లీ ముందుకు తీసుకెళ్లే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఈ కన్ఫ్యూజన్‌కు ప్రధాన కారణం.. పీఎస్ మిత్రన్, ధనుష్ కాంబినేషన్‌లో సంజయ్ లీలా భన్సాలీ నిర్మాణంలో వస్తోందని ప్రచారంలో ఉన్న మరో హిందీ సినిమానే. కరీనా కపూర్ ఖాన్ కూడా నటించనున్న ఈ మైథలాజికల్ జంగిల్ అడ్వెంచర్ మూవీ గురించి చర్చలు జరుగుతున్నాయని మిత్రన్ ఇదివరకే స్పష్టం చేసినప్పటికీ, అది ఇంకా ఫైనల్ కాలేదు. ఇప్పుడు మిత్రన్ పేరు యష్‌తో మరో అడ్వెంచర్ సినిమాకు ముడిపడటంతో హీరో మారాడనే ఊహాగానాలు మొదలయ్యాయి. త్వరలోనే దీనిపై పూర్తి క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

# 'రణబాలి' సెన్సార్ పూర్తి..కానీ?



సెన్సేషనల్ స్టార్ విజయ్ దేవరకొండ హీరోగా, తన భార్య రష్మిక మందన్నా హీరోయిన్ గా నటించిన లేటెస్ట్ సినిమా 'రణబాలి' విడుదల దగ్గరకి వస్తున్న నేపథ్యంలో సినిమా సెన్సార్ ని పూర్తి చేసుకున్నట్టుగా సినీ వర్గాలు తాజాగా కన్ఫర్మ్ చేసాయి. అయితే ఈ సినిమాకి దాదాపు అంతా ఏ సర్టిఫికెట్ నే రావచ్చు అని భావించి ఉండొచ్చు కానీ మేకర్స్ మాత్రం అలాంటి అడ్డంకులు లేకుండా యూ/ఏ సర్టిఫికెట్ ని తెచ్చుకున్నారట. ఇది ఒకింత సర్ప్రైజింగ్ కూడా కావచ్చు. కానీ ట్రైలర్ లో వైలెన్స్, కొన్ని డైలాగ్ లు ఉన్నప్పటికీ సినిమా రెస్ట్రిక్ట్ కాకుండా అన్ని వర్గాల ఆడియెన్స్ కి చేరువ అయ్యే విధంగా సెన్సార్ ముగించుకోవడం జరిగింది. సో వీటిని రా అండ్ రస్టిక్ గా ఆశించే వారికి ఒకింత థియేటర్స్ లో శాటిస్ఫై చేస్తారో చూడాలి. ఇక ఈ చిత్రానికి అజయ్, అతుల్ లు సంగీతం అందించారు. అలాగే మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహించిన ఈ సినిమా గ్రాండ్ గా పాన్ ఇండియా లెవెల్లో ఈ అక్టోబర్ 16న విడుదల కాబోతుంది.

# 'జైలర్ 2' ప్రమోషనల్ కంటెంట్..

## క్వాలిటీ మిస్ చేస్తున్న సన్ పిక్చర్స్!









ఇప్పుడు తమిళ్ సహా తెలుగు ఆడియెన్స్ కూడా ఆసక్తిగా ఎదురు చూస్తున్న అవైటెడ్ సీక్వెల్ సినిమానే 'జైలర్ 2'. సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా చాలా కాలం తర్వాత నటించిన సీక్వెల్ సినిమా ఇదే. దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించిన ఈ యాక్షన్ సినిమా గ్రాండ్ గా విడుదలకి రాబోతుంది. అయితే ఈ సినిమా నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ అంటే కొన్ని విషయాల్లో మంచి స్టాండర్డ్స్ ఉన్నాయి. ఎన్నో సూపర్ క్వాలిటీ ప్రోడక్ట్ లు వీరి నుంచి వచ్చాయి. అలాగే ప్రమోషనల్ కంటెంట్ ని కూడా వీరు అంతే రీతిలో సిద్ధం చేస్తారు. సోషల్ మీడియాలో అయితే వీరి ప్రమోషనల్ కంటెంట్, ఎడిట్స్ కి నెటిజన్స్ నుంచి మంచి మార్కులు కూడా పడతాయి. కానీ జైలర్ 2 విషయంలో ఈ మధ్య మాత్రం వీరి నుంచి ఈ క్వాలిటీ బాగా మిస్ అవుతుంది అనేది స్పష్టంగా కనిపిస్తుంది. ఊహించని విధంగా వీరు ఏఐ విజువల్స్ వదులుతున్నారు. దీనితో నెటిజన్స్ కూడా సన్ పిక్చర్స్ వాళ్ళు ఇంతలా డీగ్రేడ్ అయిపోయారా అనే కామెంట్స్ చేశారు. అంతెందుకు మొన్న ట్రైలర్ లోనే ఓ బ్లాస్ట్ షాట్ పై కూడా అనేక కామెంట్స్ వచ్చాయి. ఇక లేటెస్ట్ గా వచ్చిన పోస్టర్స్ కూడా అవెంజర్స్ సినిమా స్టైల్ లో కాపీ కొట్టినట్టే ఉన్నాయనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. దీనితో ప్రమోషనల్ కంటెంట్ లో తమదైన వైవిధ్యతను, క్రియేటివిటీ చూపించే వీరు ఇలా చేస్తుండడంతో ఫ్యాన్స్ డిజప్పాయింట్ అవుతున్నారు.

# వరుస కథలు వింటున్న వరుణ్ తేజ్..



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ ఇటీవల 'కొరియన్ కనకరాజు' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్నాడు. ఇక ఈ సినిమ తర్వాత తన నెక్స్ట్ ప్రాజెక్ట్‌గా స్పోర్ట్స్ డ్రామా 'బరి'ని ఇప్పటికే ప్రారంభించాడు. అయితే, గాయం కారణంగా కొద్దిరోజుల పాటు విశ్రాంతి తీసుకుంటున్న ఆయన కొన్ని కథలను వింటున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే 'ఆయ్' సినిమాతో విజయాన్ని అందుకున్న దర్శకుడు అంజి చెప్పిన ఓ కథ వరుణ్ తేజ్‌కు నచ్చినట్లు తెలుస్తోంది. అయితే, ఆ స్క్రిప్టును పూర్తిగా కంప్లీట్ చేశాకే వరుణ్ తన నిర్ణయం తెలిపే అవకాశం ఉందట. అటు మరో తమిళ దర్శకుడు అట్లీ శిష్యుడు బాలాజీ చెప్పిన కథను కూడా వరుణ్ వింటున్నాడట. అన్నీ కుదిరితే ఈ చిత్రాన్ని కార్తీక్ సుబ్బరాజ్ ప్రొడ్యూస్ చేసే ఛాన్స్ ఉంది. ఇలా ఇద్దరు యంగ్ డైరెక్టర్స్ చెప్పే కథలు వింటున్న వరుణ్ తేజ్, వారికి గ్రీన్ సిగ్నల్ ఇస్తాడా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. ఇక 'బరి' చిత్రంతో మరోసారి బాక్సాఫీస్ దగ్గర తన సత్తా చాటాలని వరుణ్ తేజ్ ప్రయత్నిస్తున్నాడు.

# ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న క్రేజీ కాంబినేషన్



ఇప్పుడు టాలీవుడ్ ఆడియెన్స్ అలాగే మెగా ఫ్యాన్స్ కూడా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న క్రేజీ కాంబినేషన్ లలో మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ అలాగే దర్శకుడు సుకుమార్ ల కలయికలో చేస్తున్న సినిమా కూడా ఒకటి. రామ్ చరణ్ కెరీర్ 17వ సినిమా ఇది కాగా అభిమానులు సాలిడ్ హైప్ లో ఉన్నారు. అయితే దీనిని డబుల్ చేస్తూ ఈ సినిమాకి సంగీతం అనిరుద్ అందిస్తున్నట్టు వచ్చిన రూమర్స్ కూడా ఇపుడు మరింత వైరల్ అవుతున్నాయి. అయితే ఫ్యాన్స్ ఈ క్రేజీ ప్రాజెక్ట్ అనౌన్సమెంట్ నుంచే బ్యాంగర్ కావాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. రామ్ చరణ్ పెద్ది, బన్నీ లోకేష్ కనగరాజ్ ల ప్రాజెక్ట్ అనౌన్సమెంట్ వీడియోలకి ముఖ్యంగా వాటి బ్యాక్గ్రౌండ్ స్కోర్ కి సాలిడ్ రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు అదే స్టైల్ అనౌన్సమెంట్ ఈ సినిమాకి కూడా కావాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. మరి ఈ దసరా కానుకగా సినిమా మొదలు కానుంది. సుకుమార్క్ స్టైల్ గ్లింప్స్ లాంటిది అనౌన్సమెంట్ కి వస్తుందేమో చూడాలి మరి.

# లీగ్ లో చాలా వెనుకబడ్డ రామ్ చరణ్?

## బిగ్ కాంబినేషన్స్ సెట్ చేయాల్సిందే?



టాలీవుడ్ లో ఉన్నటువంటి టాప్ మోస్ట్ బిగ్ స్టార్స్ అంతా ఇప్పుడు భారీ లైనప్ లతో తమ కెరీర్ లని ఓ రేంజ్ లో సెటప్ చేసుకుంటూ వస్తు న్నారు. అయితే ఈ హీరోస్ లో మాత్రం మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ ఒకింత వెనుకబడే ఉన్నాడనే కామెంట్స్ ఇపుడు వినిపిస్తున్నాయి. మహేష్ బాబు, అల్లు అర్జున్, ఎన్టీ ఆర్ లాంటి స్టార్స్ అంతా మాసివ్ లైనప్ ని ఈజీగా ఐదేళ్ల వరకు సెట్ చేసేసుకున్నారు. కానీ రామ్ చరణ్ చేతిలో ఇపుడు అధికారి కంగా సుకుమార్ తో సినిమా తప్ప మరో సినిమా కనిపించడం లేదు. దీనితో బిగ్ కాంబినేషన్స్ ని రామ్ చరణ్ ఓకే చేయాలని అభిమానులు చాలా ఆశగా ఎదురు చూస్తున్నారు. మిగతా స్టార్స్ అంతా ఒకదాని తర్వాత ఒకటి గ్యాప్ లేకుండా సెట్ చేసుకుంటే చరణ్ వైపు నుంచి మాత్రం చాలా నిదానమైన రెస్పాన్స్ కనిపిస్తుంది. ఇదే కొనసాగితే మాత్రం ఈ పోటీ ప్రపంచంలో చరణ్ తనని తాను లిమిట్ చేసేసుకున్నట్టే అవుతుంది. తర్వాత తనకి గ్లోబల్ లెవెల్ గుర్తింపు వచ్చినప్పటికీ ఆ రేంజ్ లో అడుగులు వేయకుండా ఎందుకు ఇలా చేస్తున్నాడు అనేది ఇప్పటికీ అభిమానుల్లో కొనసాగుతున్న ప్రశ్న...